జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన దినపత్రికలో
మంత్లీ అడ్వర్టైజ్‌మెంట్స్
4x5. Rs. 13,000/- p.m.
8x10. Rs. 24,000/- p.m.
12x10. Rs. 36,000/- p.m.
5 లైన్ల క్లాసిఫైడ్ యాడ్ రూ. 5000/- p.m.
Quarter Page (16x20) Ad (1st Page) Rs. 96,000/- p.m.
Contact : 8886022523, 9000621111, 9948725373

సంపుటి 16 సంచిక 155 విశాఖపట్నం బుధవారం 31 జనవరి 2024 8 పేజీలు వెల : 5.00

## రైతులు, నిరుద్యోగులకు ఇంపార్టెన్స్...

# అస్త్రాలు సిద్ధం

## మళ్లీ అధికారమే లక్ష్యం



- రైతు రుణమాఫీ, మెగా డీఎస్సీ
- ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్
- ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం
- రేపటి కేబినెట్ భేటీలో తీర్మానించే చాన్స్
- అనంతపురం సభకు సన్నాహాలు
- అక్కడే సీఎం జగన్ ప్రకటించే అవకాశం



అనంతపురం, ప్రజాపాలన : ఏపీలో మళ్లీ అధికారం చేపట్టడమే లక్ష్యంగా అధికార వైసీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందుకు పలు అస్త్రాలతో సిద్ధమవుతోంది. బుధవారం జరిగే (రేపు) మంత్రివర్గ భేటీలో చర్చించి.. పలు అంశాలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. అంతేగాక మంత్రివర్గం తీసుకునే నిర్ణయాలను ఫిబ్రవరి 10వ తేదీన కానీ, 11న కానీ అనంతపురంలో జరిగే సిద్ధం సభలో సీఎం జగన్ ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ప్రతిపక్షాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వైసీపీ ప్రత్యేక వ్యూహాన్ని సిద్ధం చేసిందని విశ్వసనీయ సమాచారం.

**రైతులు, నిరుద్యోగులకు ఇంపార్టెన్స్..**

ప్రధానంగా రైతు రుణమాఫీ, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, ఉద్యోగులకు పీఆర్సీలో భాగంగా ఐఆర్ ప్రకటన అంశాలున్నట్టు తెలుస్తోంది. అదే విధంగా ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం తదితర వాటిని కూడా పరిశీలించినట్టు సమాచారం. రైతు రుణమాఫీ విషయంలో ఏ ప్రాతిపదికన చేయాలి అనే చర్చ ఇప్పటికే చేపట్టారు. లక్ష లోపు రుణమా, రెండు లక్షల రుణమా? అనేది నిర్ణయించాల్సి ఉందని సమాచారం. వాస్తవానికి రెండు లక్షల లోపు అప్పులున్న రైతులకు రుణమాఫీ చేస్తే ప్రభుత్వంపై ఎంత భారం పడుతుంది.. లక్షలోపు రుణమాఫీ చేస్తే ఎంత భారం పడుతుందనే విషయాలను ఇప్పటికే నిపుణులతో చర్చించి, ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**అనంత సభలో బయట పెట్టే అవకాశం..**

అది ఎంతవరకు నిజం అనేది అనంతపురంలో సిద్ధం సభ తర్వాతే తెలుస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా లాంటి మరికొన్ని జిల్లాలను తీసుకొని తుది నిర్ణయం వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం. గత ఖరీఫ్ సీజన్‌లో, అదే విధంగా రబీ సీజన్‌లోనూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతోపాటు తుపాను కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలోనే రుణమాఫీపై కొండంత ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. వాస్తవానికి మూడు నెలల కిందట శ్రీ సత్య సాయి జిల్లా పర్యటనలో రైతు భరోసా నిధుల పంపిణీకి బటన్ నొక్కే కార్యక్రమానికి వచ్చిన సీఎం.. పుట్టపర్తి సభలోనే ఈ విషయాన్ని ప్రకటిస్తారని అనుకున్నారు. కానీ, త్వరలో అనంతపురంలో జరిగే సిద్ధం సభలో ముఖ్యమంత్రి జగన్ రుణమాఫీపై ప్రకటన చేసి రైతుల పట్ల తన చిత్తశుద్ధిని ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నిత్యం కరువు కాటకాలతో సతమతమయ్యే ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగే సిద్ధం సభలో రుణమాఫీ ప్రకటన వైకాపాకు కలిసి వచ్చే అంశంగా పరిశీలకులు భావిస్తున్నారు.

**పీఆర్సీ పెంపు.. ఐఆర్ ప్రకటన..**

రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో వారిని సంతృప్తి పరిచేందుకు పీఆర్సీ పెంపునకు సంబంధించి ఐఆర్ ప్రకటించి ఉద్యోగులకు సానుకూలంగా ప్రభుత్వం ఉందని చెప్పేందుకు నిర్ణయించినట్లు భావిస్తున్నారు. నిరుద్యోగుల ఆశలకు అవకాశం కల్పించేందుకు ఫిబ్రవరిలోనే మెగా డీఎస్సీ ప్రకటన కూడా విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి ఇటీవలనే మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటన కూడా చేశారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం సదుపాయం హామీతో కాంగ్రెస్ పార్టీ అటు కర్నాటకలోనూ, ఇటు తెలంగాణలో అధికారంలోకి వచ్చింది. దీంతో వైసీపీ సైతం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు గల సాధ్య అసాధ్యాలను అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తోంది.

## ఢిల్లీకి జగన్ ..

### అమిత్ షాతో ప్రత్యేక భేటీ



అమరావతి : ఏపీ సీఎం జగన్ ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. అయితే, ఇది అధికారిక పర్యటన కాదని, పూర్తి స్థాయిలో రాజకీయ పర్యటన అని తెలుస్తోంది. రేపు లేదా ఎల్లుండి ఆయన ఢిల్లీకి వెళ్లనున్నట్టు సమాచారం. తన పర్యటనలో ఆయన కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. రానున్న ఎన్నికల్లో ఇరు పార్టీల మధ్య సహకారంపై చర్చించనున్నట్టు తెలుస్తోంది. వైసీపీకి సహకరిస్తే ఒక రాజ్యసభ సీటును బీజేపీకి ఇచ్చేందుకు జగన్ సిద్ధంగా ఉన్నట్టు సమాచారం అందుతోంది. మరోవైపు ఏపీ రాజకీయాలు హీటెక్కిన నేపథ్యంలో ఈ భేటీపై పలు ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఇక.. కాంగ్రెస్ ఏపీ చీఫ్ షర్మిల రాకతో రాజకీయాలు మరింత రంజుగా మారాయి. షర్మిల నేరుగా తననే టార్గెట్ చేస్తుండటం జగన్ కు ఇబ్బందికరంగా మారిందని, ఈ నేపథ్యంలో బీజేపీ పెద్దలను కలిసేందుకు ఢిల్లీకి వెళ్తున్నారని సమాచారం.

## పార్లమెంట్

## సభ్యులందరి సస్పెన్షన్ రద్దు



న్యూఢిల్లీ : పార్లమెంటరీ సభ్యులందరి సస్పెన్షన్ రద్దైంది. మంది రాజ్యసభ ఎంపిల సస్పెన్షన్ మంగళవారం రద్దైంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా సస్పెన్షన్‌కు గురైన ఎంపిల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని లోక్‌సభ, రాజ్యసభ ప్రిసైడింగ్ అధికారులను ప్రభుత్వం కోరినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి మంగళవారం తెలిపారు. మోడీ ప్రభుత్వ చివరి పార్లమెంటు (బడ్జెట్) సమావేశాలు బుధవారం నుండి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే.పార్లమెంట్ భద్రతా వైఫల్యంపై కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ప్రకటన చేయాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టడంతో ( రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు) సుమారు 146 మందిపై గతనెల శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్ సస్పెండ్ సస్పెండ్ వేటు వేసింది. 146 మందిలో 136 మంది మిగిలిన సెషన్‌లలో సస్పెండయ్యారు. సెషన్ ముగియగానే వారి సస్పెన్షన్ రద్దైంది. అయితే మొత్తం 14 మంది ఎంపిల (11 మంది రాజ్యసభ, ముగ్గురు లోక్‌సభ సభ్యులు) కేసును ప్రత్యేక హక్కుల సంఘానికి సమర్పించారు.

రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాపై టీడీపీ అధినేత చంద్రబాబు కసరత్తు పూర్తి చేశారు. బరిలోకి దిగనున్న అభ్యర్థుల వడపోత ప్రక్రియను పూర్తి చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఎన్నికల సమర శంఖాన్ని పూరిస్తూ 'రా కదలిరా' పేరిట ప్రచార సభలను నిర్వహిస్తున్న చంద్రబాబు.. విరామ సమయంలో ఈ వడపోత ప్రక్రియను పూర్తి చేశారు. దాదాపు 90 నుంచి 95 శాతం అభ్యర్థుల ఎంపిక కంప్లీట్ అయినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఐవీఆర్ఎస్‌తో పాటు పలు సర్వే సంస్థల నివేదికల ఆధారంగా గెలిచే అభ్యర్థులకే టికెట్లు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.



# క్యాండిడేట్లు ఫైనల్!

## అభ్యర్థుల వడపోత పూర్తి

- వచ్చే నెల మొదటి వారంలో తెలుగుదేశం తొలి జాబితా
- కసరత్తు పూర్తిచేసిన అధినేత చంద్రబాబు
- 4, 5 తేదీలలో ప్రకటించే అవకాశాలు
- 95 శాతం వరకు అభ్యర్థులపై సర్వే పూర్తి
- గెలుపు గుర్రాలకె టికెట్లు
- పార్టీలో పెరుగుతున్న ఆశావహులు
- ఇతర పార్టీల నుంచి వలసలు, చేరికలు
- అన్నీ బేరీజు వేసుకుని జాబితా ప్రకటించనున్న బాబు

(మిగతా 5లో..)

స్నేహ హౌసింగ్ కాలనీ
అనకాపల్లి జిల్లా...
నరసాపురం గ్రామంలో... వెంకన్నపాలెం దగ్గర
స్నేహ గ్రూప్ ఆధ్వర్యంలో సభ్యులకు కో-ఆపరేటివ్
విధానంలో ఒక కాలనీ నిర్మిస్తున్నాం...
ఆసక్తిగల వారు త్వరపడండి...!
కె.బి.ఎల్.యు. ప్రెసిడెంట్
సెల్ : 9951956444
హెచ్.పి.సి.ఎల్., డిజిఎం రిటైర్డ్
బి. అప్పారావు, సెక్రటరీ
సెల్ : 091 98660 50506
ఎస్.బి.ఐ., డి.జి.ఎం. రిటైర్డ్
ఎ. పున్నారావు. ట్రెజరర్
సెల్ : 9581616209
కెనరాబ్యాంక్ చీఫ్ మేనేజర్ రిటైర్డ్



# రైతు సంఘాల ఆధ్వర్యంలో చింతలపూడి ఎత్తిపోతల పనులు పూర్తవ్వాలని కోరుతూ రైతులు నిరాహార దీక్ష

నూజివీడు, జనవరి 30, ప్రజాపాలన ప్రతినిధి: రెండు లక్షల ఎకరాలకు పైగా సాగు భూములకు సాగునీటిని అందించే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకం పేజ్-1, పేజ్-2 పనులను పూర్తి చేయడంలో వైకాపా ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘాల నాయకులు విమర్శించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం (ఏపికెఎస్) ఆధ్వర్యంలో మంగళవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఒకరోజు నిరాహార దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, కౌలు రైతు సంఘం కార్యదర్శి పి జమలయ్య హాజరై నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించగా నూజివీడు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ముద్దబోయిన వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ




చైర్మన్ కాపా శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త బర్మా ఫణిబాబు, సిపిఎం రైతు సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ నరసింహ, తదితర నాయకులు హాజరై తమ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కెవివి ప్రసాద్ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టు ముందుకు కదలలేదని, నాలుగున్నర ఏళ్లలో ఒక ఎకరాకు కూడా అదనంగా అందించిన దాఖలాలు లేవన్నారు. ప్రాజెక్టుల కోసం అంటూ బడ్జెట్ ప్రవేశపెడుతూ కాకి లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. వేల టీఎంసీల గోదావరి నీరు సముద్రం పాలు అవుతున్నా పోలవరంపై దృష్టి సారించలేదని, రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులలో నీటి పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. రాష్ట్రంలో నీటి సంక్షేమం ఏర్పడిందని రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు 1.75 మీటర్ల లోతుకు పడిపోయాయన్నారు. ప్రాజెక్టులలో నీరు లేక వర్షాభావం పరిస్థితులు ఎదుర్కొంటూ ఉన్న, నీటిని ఒడిసిపట్టలేని పాలకులు తీరువలన రైతులు తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏ పని పూర్తి కావాలన్నా దీక్షలు, ధర్నాలు చాలవని, ఖచ్చితమైన పోరాట మార్గాలు అన్వేషించాలన్నారు. కౌలురైతు కార్యదర్శి పి జమలయ్య మాట్లాడుతూ రివర్స్ టెండర్ల పేరుతో ప్రభుత్వం ప్రాజెక్ట పనులకు బ్రేకులు వేసిందని ప్రభుత్వానికి ప్రజల పట్ల ప్రాజెక్టుల పట్ల నిబద్ధత లేదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు జరుగుతున్న పనులపై సమీక్షలు జరిపి పనులను పూర్తి చేయడానికి ప్రయత్నించాలే కానీ పాత ప్రభుత్వంపై ద్వేషంతో ప్రజలను నాశనం చేయకూడదన్నారు. సంకల్పం ఉంటే అభివృద్ధి చేయవచ్చునని కానీ, ఆ పట్టుదల వైకాపా ప్రభుత్వానికి లేదన్నారు. రానున్న రోజులలో తమను వంచించిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా దీక్షా శిబిరం వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాలను అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, ఏలూరు జిల్లా రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్, లక్ష్మణరావు, కౌలురైతు నాయకులు దొంతు కృష్ణ, నూజివీడు నియోజకవర్గ రైతుసంఘం కార్యదర్శి మడిపల్లి నాగేశ్వరరావు, రైతుసంఘం నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, బొత్తుల వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు జి రాజు, రాజకీయపక్ష రైతు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరు లో జలజీవన్ మిషన్ పై శిక్షణ



గుడ్లవల్లేరు జనవరి 30(ప్రజాపాలన): గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయములో జలజీవన్ మిషన్ పై (కమ్యూనిటి కాంట్రాక్ట్ పై) శిక్షణా తరగతి మరియు జి.పి.డి.పి.సమావేశం జరిగింది. గుడ్లవల్లేరు ఎంపిపి కొడాలి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జలజీవన్ ప్రాముఖ్యత, జలజీవన్ లో స్వయం సహాయక గ్రూపులతో కలసి గ్రామాలలో చేపట్టవలసిన పనులు, వాటి నిర్వహణా తీరుతెన్నులు గురించి గ్రామ సర్పంచ్ లు ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులు, సచివాలయ గ్రేడ్ 5 కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లకు ఎంపిడిఓ శ్రీనివాస్, ఇఓపిఆర్డి దిలీప్ లు పలు సూచనలు చేసారు. ఎంపిటిసిలు రామశాస్త్రులు , నాగేశ్వర రావు, గ్రామ పంచాయతి కార్యదర్శులు, ఆర్.డబ్ల్యూ.యస్. ఎ.ఇ. శివాజీ , అబ్బ దాసరి ధర్మరాజు , ఎ.పి.యం. యస్.హెచ్.జి వెలుగు సి.సి. లు , ఎ.పి.ఓ. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు, సచివాలయ గ్రేడ్ -%ు% కార్యదర్శులు పాల్గొన్నారు.

## దుర్గాడ నాగేంద్రుడు ఆలయ అభివృద్ధికి లక్ష.రూ విరాళం..: కంబాల శ్రీనివాసరావు

కాకినాడ ప్రజాపాలన ప్రతినిధి: కాకినాడ జిల్లా దుర్గాడ లో ఉన్న నాగేంద్రుడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఫిబ్రవరి 24వ తేదీన



జరుగుతుందని,ఆలయ కమిటీ వారు నేడు అక్కడికి ఆహ్వానించినట్లు విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు అన్నారు.ఆయనతో పాటు గోకవరం గ్రామానికి చెందిన సుబ్రమణ్య శర్మ, దుర్గాడ చెందిన కవి ఈ కార్యక్రమంలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మీడియా మాధ్యమాల్లో ఇక్కడ చాలా మహిమాన్విత సర్పం 27 రోజులు పాటు ఉపవాస దీక్ష చేసి కాలం చేసిందని,ఆ దివ్యత్వాన్ని చూసినట్లు తెలిపారు.నేడు అక్కడ నాగేంద్రుడిని దర్శించుకోవడం దైవ సంకల్పం అన్నారు.అనంతరం ఫిబ్రవరి 24వ తేదీన జరగబోతున్న నాగేంద్రుడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం లక్ష రూపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు.

## ఆడపిల్లలను ఆహ్వానిద్దాం - జగతిని కాపాడుదాం



మచిలీపట్నం జనవరి 30 ప్రజాపాలన : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి గీతాబాయి అధ్యక్షతన జిల్లా లోని గ్రామీణ పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు , గుర్తింపు పొందిన లేబరేటరీ కేంద్రాల నిర్వాహకులకు , స్కానింగ్ కేంద్రాల యాజమాన్యానికి , స్త్రీల నిపుణుల వైద్య శాలల లోని వైద్యాధికారులకు లింగ వివక్షత నిర్మూలన మహిళల హక్కులు నిబంధనల రక్షణ పై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సమావేశ మందిరమునందు నిర్వహించడం అయినది . ఈ సమావేశమునకు గౌరవనీయులైన జిల్లా సివిల్ న్యాయాధికారి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యనిర్వహణాధికారి కె.వి .రామకృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గాందీ వర్ధంతి పురస్కరించుకొని జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించడమైనది. తదుపరి జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశ్యము నల్సా విధివిధానాలను ఆదేశాలను అమలు చేయుట , సమాజంలోనీ బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలను అందించుట , వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి లోక అదాలత్ నిర్వహణ మొదలగు అంశాల గురించి సవివరంగా వివరించడం జరిగింది. దీనికి సంబంధించి ప్రతి జిల్లాలో "జిల్లా న్యాయ సేవాధికార" కార్యక్రమాలను అమలు చేయటానికి జిల్లా న్యాయ సేవల అథారిటీ జిల్లా కోర్టు సముదాయాల్లో ఏర్పాటు చేయడం జరిగిందనియు, ఈసంస్థ నేషనల్ లెగల్ సర్వీసెస్ అథారిటీ ఆఫ్ ఇండియా నవంబర్ 9 తేదీ 1995న లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987 ప్రకారం ఏర్పాటు చేసినారనియు ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలు, ఫీజులు లేకుండా న్యాయ సలహాలు, సత్వర న్యాయం అందించడానికి దోహదపడుతుందని తెలియజేసినారు . ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల , నర్సింగ్ కేంద్రాల , లేబరేటరీల యాజమాన్యాలు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని మరియు మానసిక ఆరోగ్య రక్షణ చట్టమ్ మొదలైన చట్టాల పరిధికి లోబడి పని చేయవలసినదిగా తెలియజేసినారు . తదుపరి వైద్యాధికారులకు పర్యవేక్షణ సిబ్బందికి నెలవారి ప్రగతి నివేదికలపై సమీక్ష సమావేశమును నిర్వహించినారు . దీనితోపాటు జనవరి 30వ తేదీ లెప్రసీ వ్యతిరేక నిర్వహణ దినాన్ని గురించి ప్రస్తావించినారు . ఫిబ్రవరి 9వ తేదీన జిల్లాలోని అన్ని గ్రామీణ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వైద్యాధికారులు సిబ్బంది జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఆదేశించినారు. మార్చి మూడో తేదీన జరిగే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా దానికి సంబంధించిన ప్రణాళికలను సత్వరమే సమర్పించవలసినదిగా వైద్యాధికారులను ఆదేశించినారు. ఈ సమావేశంలో 2023 24 సంవత్సరానికి సంబంధించిన జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా విడుదలైన నిధులకు సంబంధించిన రాబడి వేయాలను ఆయా కేంద్రాల వైద్యాధికారులు సీనియర్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించినారు . రాబడి,వ్యయాలకు సంబంధించిన విధివిధానాలను నిర్దేశించినారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ సీతాకుమారి, డాక్టర్ విజయభారతి , డాక్టర్ హిమబిందు డాక్టర్ నాగ భవాని , కుటుంబ డాక్టర్ విధాన వైద్యాధికారులు ,ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు ,మండల పర్యవేక్షణ సిబ్బంది , కార్యాలయ సిబ్బంది ,బి శివసా%శీ%బిరెడ్డి ,బి రాజేంద్ర కుమార్ , ముసలయ్య న్యాయవాది మొదలగు వారు పాల్గొన్నారు.

## బ్యాట్మెంటన్ డబల్స్ లో విన్నర్స్‌గా నిలిచి ట్రోఫీ కైవసం చేసుకున్న సుజిత్, పవన్



గోకవరం ప్రజా పాలన జనవరి 30: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల, నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు జగ్గంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బహుమతులు అందజేశారు.అందులో భాగంగా గోకవరం నుండి నియోజకవర్గస్థాయిలో బ్యాట్మెంటన్ డబల్స్ లో విన్నర్స్ గా నిలిచి ట్రోఫీ కైవసం చేసుకున్న సుజిత్,పవన్ లకు మాజీ మంత్రివర్యులు,జగ్గంపేట వైకాపా ఇన్చార్జ్ తోట నరసింహం చేతుల మీదుగా ట్రోఫీ అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ క్రీడల్లో రాణించాలని, క్రీడల ద్వారానే గుర్తింపు లభిస్తుందని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా గోకరంలోని సుజిత్ నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ బ్యాట్మెంటన్ డబల్స్ లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం రావడం చాలా ఆనందదాయకంగా ఉన్నదని, నన్ను ప్రోత్సహించిన తిరుమల కాలేజీ యాజమాన్యానికి,కోచ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.సుజిత్ తండ్రి అల్లూరిసీతారామరాజు జిల్లా,డిస్టిక్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ వై మల్లేశ్వరరావు మాట్లాడుతూ సుజిత్ చిన్నతనం నుండి చదువులోను, క్రీడల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరిచే వారిని,తదనుగుణంగా వారిని ప్రోత్సహించేవారుమని, బ్యాట్మెంటన్ డబల్స్ లో నియోజకవర్గ స్థాయిలో విన్నర్స్ గా నిలవడం చాలా ఆనందదాయకంగా ఉన్నదని,జిల్లాస్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మన నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో బ్యాట్మెంటన్ డబల్స్ లో విన్నర్స్ గా నిలిచిన సుజిత్, పవన్ ను ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు,జడ్పిటిసి దాసరి శ్రీరంగ రమేష్, వైకాపా మండల కన్వీనర్ పాటి రాంబాబు,వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు,సర్పంచ్ కొమరం శ్రావణి (బుజ్జి ) ప్రభుత్వ అధికారులు,రాజకీయ నాయకులు అభినందనలు తెలియజేశారు.

## అవినీతికి మారుపేరుగా మందు షాపులు



అవనిగడ్డ ప్రజా పాలన ప్రతినిధి.30 జనవరి. అవనిగడ్డ కోడూరు రోడ్ లో గల మందు షాపులు అడ్డగోలుగా అవినీతికి మారుపేరుగా మారాయి. ఈ కనిపిస్తున్న వ్యక్తి మరియు చెట్లు కింద ఎదురు చూస్తున్న జనం కోకోలలు. బార్ లోకి వెళ్లి తాగుదాం అనుకుంటే 90 రూపాయలను అదనంగా చెల్లించాల్సి వస్తున్నది. పేదవాని రక్తం పీల్చుకుని పిప్పి చేసుకుని తింటున్న ప్రజాప్రతినిధులు. విషయం ఆరా తీస్తే, బ్రాండెడ్ లిక్కర్ ఏదైనా వచ్చిన వెంటనే 10 మందికి అమ్మి స్టాక్ అయిపోయింది అని చెబుతున్న సిబ్బంది. తనిఖీలు లేవు. ఈమధ్యపెరిగిన ధరలను బట్టి బెల్టు షాపుల వారికి 10 రూపాయల నుంచి 15 రూపాయలు20 రూపాయల వరకు కమిషన్ తీసుకొని బెల్ట్ షాపుల వారికి అమ్ముతున్నారు. బార్ షాపులు 11,12 గంటల వరకు ఉంటున్నాయి.ఉదయం6 గంటలకి మొదలు, 10:59 అవుతున్న ప్రభుత్వ షాపులు తీయరు.పట్టించుకున్న నాధుడు లేడు.25% చీప్ లిక్కర్, బూమ్ బూమ్ బీరు, స్పెషల్ స్టేటస్ వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నాయి. ప్రొహిబిషన్ సి.ఐని సంప్రదించగా నాకు ఎటువంటి సంబంధం లేదని చెప్తున్నారు. కంప్లైంట్ ఏదైనా ఉంటే మామూలు స్టేషన్లో ఇచ్చుకోండి అంటున్నారు. సమాచారం హక్కు చట్టం 2005 ప్రకారం హెడ్ ఆఫీస్ వారిని లెక్కలు తీయమని అడిగితే ఇంతవరకు మోక్షం లేదు. అసలు అమ్ముతున్నదెంత,వచ్చినదెంత అసలు లెక్కే లేదు. ఊరికి ఒకరికి బెల్టు షాపుల ద్వారా విక్రయిస్తున్నారు. ఎవరికి వారుఆడిందే ఆట పాడిందే పాట గా ఉన్నది పరిస్థితి.

## భూ హక్కు చట్టం ను రద్దు చేయాలని డిమాండ్!

మచిలీపట్నం జనవరి 30 ప్రజాపాలన :ప్రజా వ్యతిరేక చట్టాలను చేసి దోచుకోవాలని చూసే పాలకులకు బుద్ధి చెప్పే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయని మచిలీపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, తుంగల హరిబాబు అన్నారు.వైసిపి ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మచిలీపట్నం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకుని, మోకాళ్లపై నిలబడి నూతనంగావైసిపి ప్రభుత్వం తీసుకు వచ్చిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో జిల్లా కోర్టులో న్యాయవాదుల సంఘం ఎదుట న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు మంగళవారం నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా మచిలీపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, తుంగల హరిబాబు మీడియాతో మాట్లాడుతూ...అధికారం చేతిలో ఉందని ప్రజా వ్యతిరేక చట్టాలను చేసి దోచుకోవాలని చూసే పాలకులకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయి అన్నారు. సీనియర్ న్యాయవాది సోడిశెట్టి బాలాజీ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు మూడు నెలలుగా వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజలకు హాని చేసే నూతన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వివిధ రూపాలలో నిరసనలు తెలియజేస్తున్న పాలకులకు చీమ కుట్టినట్లయినా లేకపోవడం సిగ్గుచేటు అన్నారు.అధికార మదంతో పాలకులు ప్రజల ఆస్తులను దోచుకోవాలని దుర్మార్గపు ఆలోచనతో ఈ నూతన భూ హక్కు చట్టాన్ని పాలకులు తీసుకువచ్చారు అన్నారు.ప్రజా ప్రతినిధులకు ఈ నూతన భూ హక్కు చట్టంపై వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోవడం లేదంటే ఎంత అహంకారంతో పరిపాలన సాగిస్తున్నారో ప్రజలు గ్రహించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి, కొట్టే రఘురాం, న్యాయవాదులు, గుండు ప్రకాష్, జీవీఎల్ నరసింహారావు, పరస మధుసూదన రావు, ఎండి రిజ్వానుల్లా, ఎంఎన్ స్వామి, సుబ్రహ్మణ్యం, న్యాయవాద గుమస్తాల సంఘం ప్రధాన కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు గుడ్లవల్లేరులో జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు

గుడ్లవల్లేరు జనవరి 30(ప్రజాపాలన):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఆడుదాం - ఆంధ్రా " కార్యక్రమం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు గుడ్లవల్లేరు ఎఎఎన్ఎమ్ మరియు వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ప్రారంభమవుతాయని ఎంపిడిఓ డి.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో విజేతలకు నిర్వహించనున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో క్రీడా కారులందరు నిర్ణీత సమయం లో పాలిటెక్నిక్ కళాశాల నందు హాజరు కావలసినదిగా తెలియచేసారు. గుడ్లవల్లేరు కు ఏడు బహుమతులు : గుడివాడ నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీలలో గుడ్లవల్లేరు మండలానికి ఏడు బహుమతులు వచ్చాయని ఎంపిడిఓ శ్రీనివాస్ తెలిపారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో విన్నర్స్ గాను, మిగతా ఐదింటిలో రన్నర్స్ గా నిలిచి, గుడ్లవల్లేరు మండలానికి ప్రతిష్ట తీసుకొచ్చిన క్రీడాకారుల ప్రతిభను అభినందిస్తూ, మండలం లోని యువకులు, విద్యార్థులు స్ఫూర్తిని పొందాలని ఆకాంక్షించారు.మండలంలో ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణలో సేవలందించిన పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, వాలంటీర్లు, సహకరించిన ప్రతి ఒక్కరినీ ఎంపిడిఓ శ్రీనివాస్, తహశీల్దార్ రెహ్మాన్ మస్తాన్, ఇఓపిఆర్డీ దిలీప్ లు అభినందించారు.

## జయహో రథసారథి డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ కాంగ్రెస్ పార్టీ నందు వినతిపత్రం

విజయవాడ ప్రజా పాలన ప్రతినిధి : ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి భారతీయ న్యాయ సంహిత 106.2. HIT and RUN రద్దు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జయహో రథసారథి డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ కాంగ్రెస్ పార్టీ నందు వినతిపత్రం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జయహో రథసారథి డ్రైవర్స్ అసోసియేషన్ వాసు యేటేటి, ట్రెజరర్ కిషోర్, గద్దల శ్రీను, నాగరాజు,ఉపేంద్ర,కాజా శేషు ,సతీష్, సహదేవరావు,దుర్గారావు,సాయి,బీముడు,మధు పాల్గొన్నారు.

## జగనన్న ఇళ్ల స్థలాలు ఇవ్వలేదంటూ లబ్ధిదారులు సచివాలయం ముట్టడించారు

గోకవరం ప్రజా పాలన జనవరి 30: మండల కేంద్రమైన గోకవరంలో జగనన్న ఇళ్ల స్థలాల్లో అవ్వతోకలు జరిగాయని లబ్ధిదారులకు న్యాయం



జరగలేదని మురళి నగరానికి చెందిన లబ్ధిదారులు సచివాలయాన్ని ముట్టడించారు. ఈ విషయంపై గోకవరం గ్రామపంచాయతీ కార్యదర్శి టెంకాల శ్రీనివాస మాట్లాడుతూ ఇళ్ల స్థలాల పంపిణీ విషయంలో పంచాయతీకి ఏ విధమైన సంబంధం లేదని రెవెన్యూ అధికారులు దే మొత్తం బాధ్యతని తెలపడం జరిగింది. తమకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని మహిళలు రోడ్డుపై బేటాయించారు. ఈ సంగతి తెలుసుకున్న గోకవరం తాసిల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ నాగరాజు సంఘటన స్థలాన్ని చేరుకుని మహిళలతో మాట్లాడుతూ గతంలో వీరికి కేటాయించిన ఇళ్ల స్థలం కోర్టు వివాదంలో ఉన్నదని దానికి ప్రత్యామ్నాయంగా తంటికొండ కి వెళ్లే రహదారి పక్కన స్థలాన్ని చూసామని ఆ స్థలాన్ని జగన్ అన్న కాలనీ లబ్ధిదారులందరికీ కేటాయించడం జరుగుతుందని చెప్పారు.

## క్రికెట్ పోటీలను ప్రారంభించిన కొవ్వలి



మొగల్తూరు, జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి) :మొగల్తూరు మండలం కొత్తోట గ్రామంలోని వినాయకుడి గుడివద్ద నిర్వహించనున్న దాసాంజనేయ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు టి. సతీష్, దాసరి శివరామ కృష్ణ, బి రాజ్ కుమార్ తదితరులు ప్రముఖులు కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడుకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ క్రికెట్ టోర్నమెంటులో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు కొవ్వలి రామ్మోహన్ నాయుడు ఆర్థిక సహకారంతో 35 వేల రూపాయల నగదు బహుమతిని అందజేయనున్న నేపథ్యంలో టోర్నమెంట్ నిర్వాహకులు రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కొవ్వలి రామ్మోహన్ నాయుడు అభిమానులు పాల్గొన్నారు.

## వై.ఎన్ లో ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో సదస్సు



నరసాపురం, జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి) :స్థానిక వై.ఎన్ కళాశాలలో జనవరి 31వ తేదీ బుధవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో "విద్యా వ్యవస్థలో వస్తున్న సంస్కరణలు మరియు యువత సాధికారత సాధించేందుకు వస్తున్న సవాళ్ళు" అనే అంశంపై నిర్వహించనున్న సదస్సుకు ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె. రామ్మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారని కళాశాల యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యా మండలి రాష్ట్రంలోని ముఖ్య కళాశాలను ఎంపిక చేసి విద్యార్థులకు అవగాహనా సదస్సులను నిర్వహిస్తోందని దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా నుంచి నేక్ ఎం గ్రేడ్ సాధించిన వై.ఎన్ కళాశాలను ఎంపిక చేసి ఈ సదస్సును నిర్వ హిస్తున్నారని పట్టణానికి చెందిన సూర్యా కళాశాల, గౌతమీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు కూడా ఈ సదస్సులో పాల్గొంటారని వై.ఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ డాక్టర్ చినమిల్లి సత్య నారాయణరావు తెలిపారు.

## వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అడిషనల్ వైస్ గవర్నర్ గా గజవెల్లి పవన్‌లి




కారంపూడి..జనవరి30...ప్రజాపాలన... ప్రతినిధి: పల్నాడు జిల్లా లో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ మొదటి క్యాబినెట్ మీటింగ్ కార్యక్రమంలో అడిషనల్ వైస్ గవర్నర్గా గజవెల్లి పవన్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ పదవి సహకారం అందించిన జిల్లా గవర్నర్ కొలిశెట్టి శివ సుబ్రహ్మణ్యం టీంకు కృతజ్ఞతలు తెలిపారు.

## మహాత్మా గాంధీ 76వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు



అవనిగడ్డ ప్రజా పాలన ప్రతినిధి: జనవరి 30:- మహాత్మా గాంధీ 76వ వర్ధంతి కార్యక్రమాన్ని వివిధ పార్టీల వారు ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఉపసభాపతి డాక్టర్ మండలి. బుద్ధ ప్రసాద్ మరియు మండలి. వెంకటరామ్ (రాజబాబు) నాయకులు,జాతిపిత అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో:- మహాత్మా గాంధీ 76వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బి. రాఘవులు అధ్యక్షతన మత్తి. సుదర్శన్ మాట్లాడుతూ భారతమాత ముద్దుబిడ్డ, దేశభక్తుడు, నిగర్వి,ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, స్వాతంత్యాన్ని సాధించి పెట్టిన మహానుభావుడు, శాంతి కాముకుడుఅన్నారు. 76వ వర్ధంతిక కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు.

## రహదారి భద్రతే జీవితానికి రక్ష : గుడివాడ డిఎస్పీ శ్రీకాంత్



గుడ్లవల్లేరు (ప్రజాపాలన): అతివేగంతో వాహనాలు నడపడం జీవితాలకు ప్రమాదకరమని రహదారి భద్రత జీవితానికి రక్ష అని గుడివాడ డిఎస్పీ కె.శ్రీకాంత్ అన్నారు. కృష్ణా జిల్లా ఎస్పీ ఆదేశానుసారం 35వ జాతీయ రోడ్డు భద్రత ఉత్సవంలో భాగంగా గుడ్లవల్లేరు ఎఎఎన్ఎమ్ అండ్ వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడ డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ పి.శ్రీకాంత్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రమాదం అంటే ఒక వాహనం మరొక వాహనాన్ని ఢీకొని రోడ్డుపై పడటంకాదని, ఒక కుటుంబం రోడ్డుపై పడటమని గుర్తించాలని అన్నారు. అదేవిధంగా ఒకవ్యక్తి నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలితీసుకుంటుందంటూ,నిజజీవితంలో జరిగిన కొన్ని ఉదాహరణలను దృశ్య మాధ్యమం ద్వారా చూపిస్తూ యువకులు మరింత జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. అలాగే రోడ్ల పక్కన ఉండే గుర్తులను బట్టి వాహనాలను ఎలా నడపాలో, సురక్షితంగా గమ్యస్థానం ఎలాచేరాలో సవివరంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ సిఐ కె. ఏసు బాబు, గుడ్లవల్లేరు ఎస్ఐ జి. సత్యనారాయణ, పాలిటెక్నిక్ అకడమిక్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ జీవివి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రాజశేఖర్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు.

## వై.యస్.ఆర్. ఆసరా చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



చందర్లపాడు జనవరి 30 ప్రజాపాలన ప్రతినిధి గ్రామంలోని శ్రీ అలివేలమ్మ తల్లి ఫంక్షన్ హాల్ లో ఏర్పా టుచేసిన వైయస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్య క్రమంలో శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని నాలుగో విడ త ఆసరా మంజూరు చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ముందుగా మహిళలతో కలిసి సీఎం వైయస్ జగన్ చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించా రుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చందర్లపా డు మండలంలోని 1562 స్వయం సహాయక సంఘా ల్లోని 16,566 మంది మహిళలకు వైయస్ఆర్ ఆసరా ద్వారా నాలుగు విడతల్లో రూ.36.88 కోట్ల లబ్ధి జరి గిందనికేవలం నాలుగో విడతలోనే రూ.9.22 కోట్లు ఆసరా డబ్బు మహిళల ఖాతాల్లో జమైందన్నారు. ఎ క్కడ కులం, మతం, ప్రాంతం, వర్గం, చివరకు ఏ పార్టీ అని చూడకుండా.. ఓటు వేయకపోయినా పర్వాలేదు అర్హత ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తుందన్నారు. అక్క చెల్లెమ్మలు బాగుంటేనే కుటుంబం, రాష్ట్రం బా గుంటుందని.. మహిళ సాధికారతకు పెద్దపీట వేసిన జగనన్న ప్రభుత్వం చేయూత ఆసరా లాంటి పథకాల తో వారంతా ఆర్థికంగా తమ కాళ్లపై నిలబడేలా సం క్షేమ పథకాలను అందిస్తుందని తెలిపారు.ఈ కార్య క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయ స్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొ న్నారు.

## ఆడుదాం ఆంధ్రా" టోర్నమెంట్స్ విజేతలకు బహుమ తులను ప్రధానం చేసిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు

నందిగామ జనవరి 30 ప్రజాపాలన ప్రతినిధి పట్టణం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచే సిన "ఆడుదాం ఆంధ్రా" టోర్నమెంట్స్ విజేతలకు బ హుమతుల పంపిణీ కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ముఖ్య అతి థిగా పాల్గొని క్రీడాకారులకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికె ట్స్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామీణ, పట్టణ యువతను క్రీడల్లో ప్రోత్స హించి, క్రీడారంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపే గొప్ప లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహ న్ రెడ్డి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహి స్తుందని తెలిపారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పో టీపడేలా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పోటీలను నిర్వ హిస్తున్నామన్నారు. నైపుణ్యం ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. గ్రామీ ణ ప్రాంత క్రీడాకారుల్లో నైపుణ్యం ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక వారు ఉన్నత స్థానాలకు ఎదగలేకపోతున్నారని.. ఈ పరిస్థితిని గమనించిన సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి గ్రామస్థాయి నుండి మొదలు మండల జిల్లా స్థాయిలతో పాటు రాష్ట్రస్థా యి వరకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరిం చారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడా పోటీలను క్రీ డా కారులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎ దగాలని సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## రైతులు చేపట్టిన నిరాహార దీక్షకు వైకాపా మద్దతు




నూజివీడు, జనవరి 30, ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ కు జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టును టిడిపి ప్రభుత్వం హయాంలో 75 శాతం పూర్తి చేశారని, మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు పేర్కొన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారంనాడు చేపట్టిన ఒక్కరోజు నిరాహార దీక్షా శిబిరానికి తన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి పథకాన్ని పూర్తి చేయలేకపోతే నూజివీడు ప్రాంతానికి భవిష్యత్తే ఉండదన్నారు. ఈ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అంటూ చెపుకుంటూ రైతులకు చేసింది ఏమి లేదని, టిడిపి ప్రభుత్వంలోనే రైతులకు మేలు జరిగిందని, రైతు పక్ష ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది తెలుగుదేశం పార్టీ మాత్రమే అన్నారు. రైతుల కోసం పట్టిసీమను 12 నెలల్లో పూర్తి చేసి, గోదావరి జలాలను కృష్ణా జలాలలో కలిపిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు చింతలపూడి ఎత్తిపోతల పేజ్-1, పేజ్-2 పథకానికి 5500 కోట్లు బడ్జెట్ కేటాయించి, 3500 కోట్లు ఖర్చు చేసి 70 శాతం పైగా పనులను పూర్తి చేశారన్నారు. నూజివీడు నియోజకవర్గంలో నారా లోకేష్ పాదయాత్రలో చింతలపూడి ఎత్తిపోతల పేజ్-1, పేజ్-2 పనులను అధికారంలో రాగానే రెండు సంవత్సరాలలో పూర్తి చేస్తామని మాటిచ్చారన్నారు. టిడిపి జనసేన కుటమితో ఏర్పడే ప్రభుత్వంలో మాత్రమే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేస్తారని, నూజివీడు నియోజకవర్గ పరిధిలోని 87 గ్రామాల రైతులకు నీరందించి రైతులను ఆదుకుంటారన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన తాసిల్దార్



కారంపూడి... జనవ రి30...ప్రజా పాలన... ప్రతినిధి.... మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో సచివాలయం1 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మండల తాసిల్దార్ శ్రీనివాస్ యాదవ్ ఈ కార్యక్రమంలో ఒప్పిచర్ల ప్రెసిడెంట్ ఇరగదండ్ల రమణ కొండలు, ఇరగదాండ్ల లాజర్, వైద్యశాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, పంచాయతీ సెక్రెటరీ, ఆశ వర్కర్లు ,గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు జగన్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు



నందిగామ జనవరి 30 ప్రజాపాలన ప్రతినిధి పట్టణం కాకాని నగర్ నందు మాజీ శాసనసభ్యురాలు తంగి రాల సౌమ్య వారి కార్యాలయంలో జగన్ రెడ్డి ప్రభుత్వానికి సుప్రీమ్ కోర్ట్ ఇచ్చిన తీర్పుపై మంగళ వారం నాడు ఒక ప్రకటనలో మాట్లాడుతూ అధికార గర్వంతో జగన్ రెడ్డి అండ్ కో పెట్టిన కేసులు తప్పుడివి అని సుప్రీంకోర్టు తీర్పుతో వెల్లడైందన్నారుప్రతిపక్ష నాయ కు ల మీద తప్పుడు కేసులు పెడుతూ ప్రజా ధనాన్ని దు ర్వినియోగం చేస్తోందన్నారుచంద్రబాబు నాయు డుని ఇబ్బంది పెట్టాలని చూస్తున్న ఈ జగన్ రెడ్డి ప్ర భుత్వా నికి సుప్రీంకోర్టు తీర్పు ఓ చెంపపెట్టన్నారుసు ప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికైన జగన్ రెడ్డి, వై సీపీ నా యకులు సిగ్గుపడాలన్నారు.

## వై.యస్ పాలెంలో మహాత్మా గాంధీ వర్ధంతి



నరసాపురం, జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి) : నరసాపురం మండలం యర్రంశెట్టివారి పాలెం పంచాయతీ చవ్వాకులవారి మెరక హరిజనపేటలోని కమ్యూనిటీ హాలులో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమాంబ ముఖ్యఅతిథిగా పాల్గొని మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగ ముత్యమాంబ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహాత్మ గాంధీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. హరిజన పేటలో కుష్టి వ్యాధి నివారణ కొరకు అవగాహన కల్పిస్తూ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హెల్త్ కార్డు కలిగి ఉన్న రోగులు పెద్ద సంఖ్యలో ఈ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించు కున్నారు. అవసరమైన రోగులకు తగిన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి త్రినాధ వెంకటనరసింహారావు (బాబులు), పిహెచ్సి వైద్యులు డాక్టర్ ఎం మాధురి, ఆర్ ప్రసన్నకుమార్, రత్నమాల, పెట్ట కళ్యాణి, ఉప సర్పంచ్ తెలగంశెట్టి శ్రీదేవి వాసు, చవ్వాకుల నాగేశ్వరరావు, ఆశా వర్కర్లు, పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్ ఏర్పాట్లపై బిఎల్వో ల సమావేశం



గుడ్లవల్లేరు జనవరి 30(ప్రజాపాలన): మరణించిన మరియు మార్పులు, చేర్పులకు సంబంధించి ఓటర్ల అభ్యర్థనలు ఏమైనా వుంటే సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని గుడ్లవల్లేరు తహశీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తాన్ పేర్కొన్నారు. గుడ్లవల్లేరు తహశీల్దార్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారుల సమావేశమును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రెహ్మాన్ మస్తాన్ మాట్లాడుతూ పోలింగ్ బూత్ లలో చేయవలసిన ఏర్పాట్లు గురించి, ప్రత్యేకంగా విభిన్న ప్రతిభావంతులు(వికలాంగులు), వృధ్ధుల కొరకు వీల్ ఛైర్లు, వాటి ర్యాంపులు, విశ్రాంతి గదుల ఏర్పాటుకు ప్రణాళికల సిద్ధపరచాలని,అదేవిధంగా ఓటర్ల జాబితాల్లో ఏ పొరపాటు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండలంలోని బిఎల్వో లకు సూచించారు. ఈ సమావేశంలో డిటి రత్న కుమారి, ఆర్ఐ షకీలా బేగం, వీఆర్వో లు ప్రకాష్, భాస్కర్, మల్లికార్జున, వెంకన్న, గంగాధర్, రవి, ఖాన్ మరియు బిఎల్వో లు పాల్గొన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

బుధవారం 31, జనవరి 2024

## ఉత్తరాంధ్రలో ఒక్క ప్రాజెక్టయినా పూర్తి చేశారా?

ఉత్తరాంధ్ర వెనుకబడి ఉన్నదని, విశాఖలో పరిపాలన రాజధాని నెలకొల్పి ఉద్ధరిస్తాననే భావోద్వేగాలతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దాదాపు అయిదేళ్ల పదవీకాలం గడిపారు. ఉత్తరాంధ్ర మూడు ఉమ్మడి జిల్లాల్లో అత్యధికులు ఈ రోజుకూ వ్యవసాయాధారంగా బతుకుతున్నారు. జగన్ హయాంలో అక్కడ ఒక్క సాగునీటి ప్రాజెక్టయినా పూర్తి కాలేదు. ఒక్క ఎకరాకయినా అదనంగా సాగునీటి వసతి కల్పించలేదు. మరి ఏ ధైర్యంతో తిరిగి తనకు పట్టం కట్టమని ఆయన ఉత్తరాంధ్ర రైతులను, అడుగుతున్నారు? సాగునీటి రంగంలో వ్యయం చేసిన గణాంకాలు పరిశీలిస్తే జగన్ ప్రభుత్వానికి ఉన్న ప్రాధాన్యతలు అవగతమౌతాయి. ఇటీవల రాష్ట్ర ఇంజనీర్ ఇన్ చీఫ్ ఉత్తరాంధ్రలో తక్కువ నిధులు వ్యయం చేసినట్లు ప్రకటించడం గమనార్హం. ఉత్తరాంధ్రలో వర్షపాతం ఎక్కువ. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే ఉత్తరాంధ్ర ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. దురదృష్టమేమంటే పడిన వర్షపు నీరంతా సముద్రం పాలౌతోంది. వంశధార, నాగావళి వంటి నదులే కాకుండా చిన్నా చితక నదులు చాలా ఎక్కువగా ఉన్నాయి. వెనుకబడిన రాయలసీమతో పోల్చుకొన్నా మధ్య తరహా ప్రాజెక్టులు ఉత్తరాంధ్రలో ఎక్కువ. ఈ అయిదేళ్ల కాలంలో పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం అటుంచి, గతంలో నిర్మితమైన ప్రాజెక్టుల కాలువల ఆధునీకరణ, మరమ్మతులకు నిధులు విదల్చనందున అవన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ ప్రాజెక్టుల కాలువలు కొంతమేర పూడి పోగా, ఎక్కువ భాగం పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్కలతో నిండిపోయాయి. కొన్ని పథకాల కింద భూసేకరణ ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లుంది.జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టాక తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితం పొందే ప్రాజెక్టుల లిస్ట్ రూపొందించారు. అందులో శ్రీకాకుళం జిల్లాకు చెందిన వంశధార, నాగావళి నదుల అనుసంధానం ఒకటి. దీనిని పూర్తి చేస్తే ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 50 వేల ఎకరాలకు సాగునీరు అదనంగా అందించవచ్చు. తెలుగుదేశం హయాంలో ఈ అనుసంధానం పనులు దాదాపు 60 శాతానికి పైగా పూర్తి అయ్యాయి. 19 టియంసిల సామర్థ్యంతో హిరమండలం జలాశయం దాదాపు పూర్తయింది. ఈ జలాశయం నుంచి నాగావళి నదిపై నిర్మితమైన నారాయణపురం ఆనకట్ట వరకు 33 కిలోమీటర్ల కాలువ తవ్వవలసి ఉంది. గ్రావిటీతో బేషుగ్గా నీళ్లు వెళతాయి. దురదృష్టమేమంటే తుదకు నారాయణపురం ఆనకట్ట గేట్లు కూడా దెబ్బతిన్నాయి, ఆనకట్ట దిగువ భాగంలో చప్టా ధ్వంసమైం ది.వంశధారపై నేరడి బ్యారేజీతో పాటు సైడ్‌వేర్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్‌కు ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చింది. నేరడి బ్యారేజీ నిర్మాణం వల్ల ఒడిషా రాష్ట్రంలో 106 ఎకరాల భూమి ముంపునకు గురౌతుందని, దానిని ఒడిషా సేకరించి ఇవ్వాలని వంశధార ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. ఇది జరిగితే అనుసంధానం గట్టెక్కినట్లే. ఒడిషా ప్రభుత్వంతో పలుమార్లు సంప్రదింపులు జరిపి ఒప్పించేందుకు ముఖ్యమంత్రికి తీరిక లేకపోయింది. అంతిమంగా ఇటీవల గొట్టా బ్యారేజీ నుంచి ఎత్తిపోతల ద్వారా హిరమండలం జలాశయానికి వంశధార నీళ్లు తరలిస్తామని ప్రకటనలు చేసి చేతులు దులుపుకొన్నారు. వాస్తవంలో గొట్టా బ్యారేజీ వద్ద 115 టియంసిలు నీళ్లు లభ్యమౌతాయని వంశధార ట్రిబ్యునల్‌తో పాటు కేంద్ర జలసంఘం నిర్ధారించింది. 1962లో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు గొట్టా బ్యారేజీ నిర్మితమై ఫిఫ్టీ ఫిఫ్టీ పద్ధతిలో ఆంధ్రప్రదేశ్ ఒడిషా రాష్ట్రాలు నీటిని వినియోగించుకొంటున్నాయి. ఇన్నేళ్లయినా వంశధార నుంచి 30 టియంసిలు నీళ్లు కూడా ఆంధ్రప్రదేశ్ వాడుకోవడం లేదు. ఒడిషా కూడా చుక్క నీరు ఉపయోగించుకోవడం లేదు. కానీ పై భాగంలో వంశధార నుండి రుషికుల్యం నదికి వరద నీళ్లు తరలిస్తోంది. పైగా ఆంధ్రప్రదేశ్ అనుమతి లేకుండా హరిభంగి డ్యాం నిర్మించింది. అయినా వంశధార నుంచి 82 టియంసిలు నీళ్లు ఏటా సముద్రం పాలౌతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కొత్త ప్రాజెక్టులు సంగతి దేవుడెరుగు. ఎప్పుడో నిర్మితమైన వంశధార ప్రాజెక్టు కాలువల ఆధునీకరణ కూడా అటకెక్కింది. విషాదమేమంటే ఉత్తరాంధ్రలో పలు ప్రాజెక్టులకు అత్యల్పంగా నిధులు వ్యయం చేసి, అదే సమయంలో కొన్ని పథకాల అంచనాలు మాత్రం భారీగా పెంచేశారు. పోనీ పనులు జరిగాయా అంటే అదీ లేదు. పెండింగ్ ప్రాజెక్టులు గాని, నిర్మాణం జరిగిన పథకాల మరమ్మతులు గాని ఎప్పటికప్పుడు పూర్తి చేస్తే తప్ప, ప్రతి ఏటా పెరిగే షెడ్యూల్ రేట్లు తడిసి మోపెడవుతాయి. ఈ అయిదేళ్ల కాలంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సాగునీటి రంగంపై చూపిన నిర్లక్ష్యం ఫలితంగా రేపటి ఎన్నికల్లో ప్రభుత్వం మారినా రాష్ట్రంలో సాగునీటి రంగాన్ని గాడిన పెట్టడం తలకు మించిన పని కాబోతోంది. ఉత్తరాంధ్ర ప్రజల్ని మభ్యపెట్టేందుకు కొన్ని పనులకు పరిపాలన అనుమతులు ఇచ్చి, టెండర్లు పిలిచి, పనులు చేపట్టినా, చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వాళ్ళు ఎక్కడ పనులు అక్కడే వదలిపెట్టి వెళ్లిపోతున్నారు. విజయనగరం జిల్లాలో నాగావళి నదిపై తోటపల్లి బ్యారేజీ 2003లో చంద్రబాబునాయుడి హయాంలో నిర్మాణం మొదలై, 2015లోనే మళ్లీ ఆయన హయాంలోనే ప్రారంభోత్సవానికి నోచుకొన్నది. 2.51 టియంసిలు సామర్థ్యంతో నిర్మించిన ఈ బ్యారేజీ ద్వారా లక్ష ఇరవై వేల ఎకరాలకు సాగునీరు అందవలసి వుంది. 1908లో నిర్మితమైన పాత బ్యారేజీ కింద 56 వేల ఎకరాల ఆయకట్టు వుంది. వెరసి మొత్తం ఆయకట్టు లక్షా 76 వేల ఎకరాలకు సాగునీరు అందించవలసి ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. అదనపు ఆయకట్టుకు సాగు నీరు ఇవ్వడం అటకెక్కింది. తాజాగా పాత ఆయకట్టుకు నీళ్ల కోసం రైతులు రోడ్డెక్కారు. నాగావళి ఉప నదిపై జంఝావతి ఆధారంగా భారతదేశంలోనే అరుదైన పద్ధతిలో రబ్బరు డ్యాము నిర్మాణం జరిగింది. నాలుగు టీఎంసీల నీళ్లు ఉపయోగించుకొనే విధంగా నిర్మాణం జరిగితే, భూసేకరణ, కాలువలు మరమ్మతులకు నోచుకోనందున పూర్తి ఫలితాలు లభ్యం కాలేదు. వీటన్నింటికి మించి మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ జలాశయ నిర్మాణం ఉత్తరాంధ్ర ఇతర ప్రాజెక్టులలాగే అనిశ్చితిలో ఉంది. ఆ మధ్య సవరించిన అంచనాలతో పరిపాలన అనుమతి ఇచ్చారు. అయినా ఏం ప్రయోజనం? పుణ్యకాలం గడిచిపోయింది. తెలుగుదేశం, కాంగ్రెస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల టెండర్లు జరుగుతుంటే పెద్ద హడావుడి జరిగేది. శాంతిభద్రతల సమస్య తలెత్తి కాంట్రాక్టర్లను అదుపు చేసేందుకు పోలీసులు రంగప్రవేశం చేసేవారు. వైసీపీ హయాంలో సీన్ రివర్స్ అయింది. టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. అరకొర టెండర్లు వేసినా పనులు చేయడం లేదు.

సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు
editor. prajapalana@gmail.com
మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన
దినపత్రికలో ప్రచురించబడును

## లౌకికతత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణే గాంధీజీకి నిజమైన నివాళి

నేడు గాంధీ 76వ వర్ధంతి తాను సనాతన హిందువునని, నిత్యం భగవత్ గీత పారాయణం చేస్తానని, దాన్ననుసరించే జీవితాన్ని మలచుకున్నానని ప్రకటించుకున్న జాతిపితను 1948 జనవరి 30న హిందూ మతోన్మాది, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్త నాథూరామ్ గాడ్సే తుపాకితో కాల్చి చంపాడు. గాంధీ హత్య కేసులో ఆధారాలు లేక విడుదలైన సావర్కర్ శిష్యుడే గాడ్సే. మత సామరస్య సాధన కోసం గాంధీజీ చేసిన కృషి, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం కోసం ఆయన సల్పిన పోరాటం జీర్ణించుకోలేకనే ఆర్.ఎస్.ఎస్ వారు ఈ దారుణానికి పాల్పడ్డారు. భారతదేశ, ప్రజల నిర్దిష్ట పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసి, ఆకళింపు చేసుకున్న స్వాతంత్ర్య ఉద్యమ నేతల్లో మహాత్ముడు అగ్రగణ్యుడు. గాంధీ ఆర్థిక, సనాతన భావాల పట్ల విభిన్న దృక్కోణాలు చరిత్రకారుల్లో ఉన్నప్పటికీ భారతీయులందర్నీ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమ పథంలోకి నడిపిన నాయకుడు గాంధీజీ. తొలినాటి జాతీయోద్యమంలో సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా విజ్ఞప్తులు, రాయబారాల ద్వారా రాయితీలు పొందాలని ఉద్యమిస్తుంటే గ్రామీణ, పట్టణ దిగువ తరగతులను కూడా స్వాతంత్ర్య పోరాటంలోకి నడిపిన నాయకుడాయన. ఆ మహనీయుడ్ని హత్యగావించడానికి సిద్ధాంత పునాది కలిగిన ఆర్ఎస్ఎస్ సామ్రాజ్యవాదులకు మోకరిల్లింది. గాంధీజీ ఆ ధోరణిని ప్రతిఘటించాడు. ఆ సిద్ధాంత వాదులే దశాబ్ద కాలంగా దేశ రాజకీయ అధికారాన్ని ఏలుతున్నారు. మరోసారి 2024లో అధికారానికై అర్రులు చాస్తున్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బిజెపి గెలుపు ద్వారా తమ మతోన్మాద మనువాద ఎజెండాని పూర్తిగా అమలు జరపాలని ఉవ్విళ్లూరుతున్నారు. భారత ప్రజలు, సంపద సృష్టికర్తలైన కష్టజీవులు ఈ ప్రమాదాన్ని నివారించడానికి ప్రతినబూనాల్సిన సం దర్భమిది. **మతం పట్ల మహాత్ముడి అభిప్రాయం** భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమిదని గాంధీజీ నమ్మాడు. వివిధ మతాలున్న మన దేశం వైవిధ్యాన్ని పరిరక్షించుకొంటూనే ప్రజలందర్నీ భాగస్వాముల్ని చేయాలన్నాడు. మతం పూర్తిగా వ్యక్తిగతమైనదని రాజకీయాల్లో, ప్రభుత్వ విధానాల్లో దానికి పాత్ర ఉండరాదని ప్రవచించడమే కాదు, ఆచరించాడు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన 1947 ఆగస్టు 14 రాత్రి గాంధీజీ స్వాతంత్ర్య సంబరాల్లో పాల్గొనలేదు. ఆ




రోజు రాత్రి మత కలహాలను ఆపడానికి ప్రయత్నించాడు. అంతకు ముందు దేశ విభజన సందర్భంగా ప్రస్తుత బంగ్లాదేశ్‌లో ఉన్న నౌఖాలిలో హిందూ-ముస్లిం మతోన్మాద అగ్నికీలల్ని నివారించడానికి సత్యాగ్రహం చేపట్టాడు. 1948 జనవరి 12న బిర్లా గృహంలో చేసిన చివరి నిరాహార దీక్ష కూడా మత సామరస్యాన్ని కోరుతూ చేపట్టినదే. మత సామరస్యం పట్ల, లౌకికవాదం పట్ల ఆయన అచంచల విశ్వాసాన్ని తెలియజేస్తుంది. కాని "హిందూస్థాన్ దేశంలో హిందూ జాతి, హిందూ మతం-హిందూ సంస్కృతి, భాషలు తప్ప భిన్నమైన వారందరూ జాతి జీవనం నుండి బహిష్కృతువ్వాలని, భిన్నంగా ఉండేవారంతా దేశ ద్రోహులని" 1939 లోనే ఆర్.ఎస్.ఎస్. అధినేత గోల్వాల్కర్ ప్రకటించాడు. నేటి పాలకులు దానినే ఆచరిస్తున్నారు. మత విద్వేషాల్ని రెచ్చగొట్టడం, జాతులు, భాషలు, సంస్కృతుల మధ్య వైషమ్యాల్ని రెచ్చగొట్టడం చూస్తున్నాం. అనుభవి స్తున్నాం. దీన్ని తీవ్రంగా ప్రతిఘటి ంచాలని గాంధీజీ ఉద్బోధించాడు. దేశ స్వాతంత్ర్యానికి పునాది హిందూ ముస్లిం ఐక్యతని గాంధీజీ చాటాడు. నేడదే శిరోధార్యం. **సామ్రాజ్య వాద వ్యతిరేకత స్వావలంబన** గాంధీజీ సామ్రాజ్యవాద వ్యతిరేకి. దక్షిణాఫ్రికాలో ఉండగా జాతి వివక్షతకు వ్యతిరేకంగా సత్యాగ్రహం ప్రారంభించాడు. మన దేశంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రజల్ని ఐక్యం చేసి పోరు సల్పాడు. కాని నేటి పాలకులు అమెరికన్ సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లి స్వాతంత్ర్యం కోసం పోరాడు తున్న పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌ని నిస్సిగ్గుగా బలపరుస్తున్నారు. అమెరికా కనుసన్నల్లో భారత సార్వభౌమాత్వాన్ని నీరుగార్చేలా వివిధ రకాల ఒప్పందాలు చేసుకోవడం, శాంతికి భంగం కలిగించే విన్యాసాల్లో పాల్గొనడం జరుగుతున్నది. స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలు కాంక్షించింది ఇది కాదు. జాతీయ స్వావలంబన, ఆర్థిక స్వయం ప్రతిపత్తి కావాలని బాపూజీ కలలుగన్నాడు. నేడు గాంధీ కలలుగన్న స్వావలంబనను నిర్వీర్యం చేస్తున్నారు. విదేశ పెట్టుబడులు, స్వదేశీ కార్పొరేట్లపై ఆధారపడిన వ్యవస్థను నేటి పాలకులు నిర్మిస్తూ స్వయం ప్రతిపత్తికి తిలోదకాలిచ్చారు. ఈ విధానాల్ని ప్రతిఘటించాల్సిందే. **సామాజిక న్యాయం కోసం**దేశంలో అణగారిన బడుగు, బలహీన వర్గాలు, స్త్రీల విముక్తి కోసం గాంధీజీ పోరాటం చేశాడు. నాగరికతకు, ఊరికి దూరంగా నెట్టబడిన దళితులు, బలహీన వర్గాలను, హరిజనులను జన జీవన ప్రవంతిలోకి తీసుకు రావడానికి సమాజం అంగీకరించేలా హరిజనోద్ధరణ, సహపంక్తి భోజనాలు పెద్ద ఎత్తున జరిపేలా సంస్కరణోద్యమం నడిపాడు. స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండాలని, స్వాతంత్ర్యోద్య మంలో వారూ భాగస్వాములు కావాలని సబర్మతి ఆశ్రమ ద్వారాలను వారికోసం తెరిచాడు. అంతేకాక, దేశ భవితలో వారూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించిన సంస్కరణవాది గాంధీజీ. **ప్రజాస్వామ్య పరిరక్షణ** బలవంతులకు ఎన్ని అవకాశాలుంటాయో అన్ని అవకాశాలు బలహీనులకు కూడా ఇవ్వాల్సిందేనన్నాడు గాంధీజీ. రాజకీయ అధికారం ప్రజల జీవితాల్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపర్చాలని, జాతి జీవనంలో అందరికీ సమ ప్రాధాన్యత ఉండాలని, దేశానికి ప్రజలే అధిపతులుగా వుండాలని తదనుగుణంగా రాజకీయ వ్యవస్థ రూపొందాలన్నాడు. ప్రజల స్వయం ప్రతిపత్తి, పరస్పర సహకారం ఆధారంగా ప్రజాస్వామ్యంలో అభివృద్ధి ఉండాలని ఆకాంక్షించాడు. ఇవే మన రాజ్యాంగంలో పొందుపర్చబడిన అంశాలు. కాని నేటి పాలకులు పటిష్ట నిఘా పర్యవేక్షణలో నిర్మించామని చెబుతున్న పార్లమెంట్ భవనంలో అగంతకుల గలభాపై చర్చించడానికి, ప్రజలు ఎన్నుకున్న పార్లమెంటుకు సమాధానం చెప్పడానికి ప్రధాని, హోం మంత్రి సంసిద్ధత వ్యక్తం చేయలేదు. పైగా దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిగా ఈ విషయమై చర్చ జరగాలని కోరిన 146 మంది ప్రతిపక్ష పార్లమెంటు సభ్యుల్ని ఏకపక్షంగా సస్పెండ్ చేశారు. బ్రిటీష్ వారు ఆనాడు తెచ్చిన రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా తీవ్ర పోరాటం చేశాడు గాంధీజీ. వాక్, సభ, పత్రికా స్వాతంత్ర్యాలు, భావ ప్రకటన స్వేచ్ఛ ప్రజల హక్కన్నాడు. కానీ నేటి పాలకులు పార్లమెంట్ సభ్యుల్ని సస్పెండ్ చేసి ప్రతిపక్షాలు లేకుండానే వ్యక్తిగత స్వేచ్ఛను, వాక్‌సభా పత్రికా స్వాతంత్ర్యాలను నిర్వీర్యం చేయడానికి వీలుగా సిఆర్‌పిసి, ఐపిసి, ఎవిడెన్స్ యాక్ట్ లాంటి 18 నిరంకుశ చట్టాలు ఆమోదింపచేసుకున్న తీరు భారత ప్రజాస్వామ్యానికి పట్టిన దుర్గతిని తెలియజేస్తోంది. గాంధీజీ రాష్ట్రాలకు, స్థానిక సంస్థలకు స్వయం ప్రతిపత్తి, అధికారాలు, నిధులు ఉండేలా గ్రామ స్వరాజ్యం రావాలన్నాడు. కాని రాజ్యాంగంలో ప్రకటించిన రాష్ట్రాల హక్కులపైన, స్థానిక సంస్థల హక్కులు, అధికారాలు, నిధులపైన నేటి పాలకులు దాడి చేస్తూ గణతంత్ర రాజ్యం స్థానే ఏకస్వామ్య పరిపాలన, ఏక పార్టీ-ఏక వ్యక్తి పాలన దిశగా సాగడాన్ని సహిద్దామా? దీన్ని నిలువరించకపోతే ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. నిరంకుశత్వం రాజ్యమేలుతుంది. నేడు దేశం కార్పొరేట్-మతోన్మాదుల చేతుల్లో చిక్కింది. దేశ పాలకులు దేశ స్వాతంత్ర్యానికి, ప్రజాస్వామ్యానికి, లౌకికతత్వానికి, సామాజిక న్యాయానికి, ఫెడరలిజానికి, స్వయంప్రతిపత్తికి ప్రమాదం కొనితెచ్చారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా మహాత్ముని ఉత్తేజంతో మరో స్వాతంత్ర్య పోరాటానికి పూనుకోవడమే 76వ వర్ధంతి సందర్భంగా ఆయనకి మనం అర్పించే నిజమైన నివాళి.

# ఎజెండా సెట్టింగ్




పాత పెన్షన్ స్కీం (ఒపిఎస్)ను పునరుద్ధరించే పార్టీలకే ఓటేస్తామని ఉపాధ్యాయ, ఉద్యోగులు ప్రతిన బూనడం స్వాగతించదగింది. మాటలతో మభ్యపెడతామంటే కుదరదు, మేనిఫెస్టోలో చేర్చి, అధికారం చేపట్టగానే తొలి సంతకం పెడతామని ప్రకటించాలని కోరడం మంచిదే. ఒపిఎస్‌పై వైఖరేంటో రాజకీయ పక్షాలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే అసెంబ్లీకి తమ ప్రతినిధులను పంపడానికి సిద్ధపడతామని హెచ్చరించారు కూడా. ఒపిఎస్‌పై ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆదివారం రాజమండ్రిలో భారీ బహిరంగసభ పెట్టుకున్నారు. ఆ సభకు వెళ్లనీకుండా సర్కారు అడ్డుకున్నప్పటికీ వేలాదిగా తరలి రావడం విశేషం. భవిష్యత్ కార్యాచరణ సభాముఖంగా ప్రకటించారు. ఒపిఎస్ కోసం ఇప్పటి వరకు నిర్వహించిన పోరాటాలు ఒక ఎత్తు కాగా ఎన్నికల ముంగిట పార్టీలపై ఒత్తిడి కోసం చేపట్టిన పోరాటాలు మరొక ఎత్తు. ఫిబ్రవరి 1 నుంచి మార్చి చివరి వరకు కార్యక్రమాల ఎజెండా పార్టీల ముందుంచారు. ఇక తేల్చుకోవాల్సింది పార్టీలే. కేంద్రంలో 2003లో బిజెపి సర్కారు ఉద్యోగులకు ఒపిఎస్ స్థానంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) చట్టం వచ్చింది. వామపక్షాలు మాత్రమే వ్యతిరేకించగా దాదాపు అన్ని పార్టీలూ సమర్థించాయి. 2004 జనవరి నుంచి వాజ్‌పేయి ప్రభుత్వం కేంద్రంలో సిపిఎస్ అమలు చేయగా, అదే ఏడాది సెప్టెంబర్ నుంచి ఉమ్మడి ఎ.పి లో వైఎస్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు ప్రారంభి ంచింది. కాలక్రమేణ సిపిఎస్ అన్యా యాన్ని అనుభవ పూర్వకంగా అర్థం చేసుకున్న ఉద్యోగులు ఆ స్కీం రద్దుకు ఉద్యమాలు చేస్తున్నారు. సిపిఎస్ రద్దు కోసం 2019 ఎన్నికలకు ముందు మన రాష్ట్రంలో పెద్ద పోరాటం జరగ్గా టిడిపి ప్రభుత్వం కమిటీ పేరిట మభ్యపెట్టి తక్కువ పింఛన్ ప్రతిపాదించగా తిరస్కరించారు. పాదయాత్రలో అప్పటి ప్రతిపక్ష నేత జగన్, తామొస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామన్నారు. ఉద్యోగుల పలు ఆందోళనల అనంతరం, అదీ అధికారం లోకొచ్చిన నాలుగేళ్లకు సిపిఎస్ కుదరదని, ప్రత్యామ్నాయంగా గ్యారంటీడ్ పెన్షన్ స్కీం (జిపిఎస్) అన్నారు. సిపిఎస్, జిపిఎస్ దాదాపు ఒకటే. మరోవైపు మోడీ ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేసే ప్రశ్నే ఉత్పన్నం కాదని పార్లమెంట్‌లో తెగేసి చెప్పింది. ఉపాధ్యాయ, ఉద్యోగులు ఒపిఎస్ కోసం ఉద్యమ బాట పట్టారు. మాయ మాటలతో మోసం చేస్తున్న పార్టీలను నిలదీసేందుకు ఎన్నికలకు ముందు వారు ఎంచుకున్న పోరాట మార్గం సహేతుకమైనది. ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయి. పార్టీల అసలు రంగు బయట పడుతుంది.రాష్ట్ర ప్రభుత్వంలో 11 లక్షల మంది వరకు పని చేస్తుండగా ఐదున్నర లక్షల మందే ప్రభుత్వ ఉద్యోగులు. మిగతా సగం కాంట్రాక్టు, ఔట్‌సోర్స్. సర్కారీ కొలువుల్లోని మూడు లక్షల మంది సిపిఎస్ పరిధిలో ఉన్నారు. సిపిఎస్‌కు ఒపిఎస్‌కు మధ్య భారీ తేడా ఉంది. ఒపిఎస్‌లో రిటైరయ్యే సమయానికి ఉద్యోగికి ఉన్న జీతంలో దాదాపు సగం పెన్షన్ వస్తుంది. అదే సిపిఎస్‌లో అయితే ఎంత సీనియర్ ఉద్యోగికైనా గరిష్టంగా వచ్చేది రూ.7 వేలు. పైపెచ్చు సర్వీస్‌లో చనిపోతే ఒపిఎస్‌లో మాదిరి పెన్షన్. రిటైరయ్యాక బతికుంటే నామమాత్రపు పెన్షన్. ఈ అన్యాయంపైనే ఉద్యోగులు ఎలుగెత్తారు. సిపిఎస్, జిపిఎస్ కాదు తమకు ఒపిఎస్ కావాలంటున్నారు. సమాజానికి 30 నుంచి 40 ఏళ్లు సేవ చేసి రిటైరయ్యాక కనీస బతుకు బతికేందుకు ఉద్యోగులకు ఉన్న కనీస భరోసాను తొలగించడం దారుణం. ఉద్యోగుల ఆందోళనలతో పంజాబ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, జార?ండ్, హిమాచల్‌లో సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌కు వెళ్లారు. కేరళ, కర్ణాటక, అసోం, తమిళనాడు, తెలంగాణ ఆ దిశగా కసరత్తు చేస్తున్నాయి. సిపిఎస్ రద్దు హామీ ఇచ్చిన ఇక్కడి ప్రభుత్వం ఆర్థిక సంక్షోభం సాకు వెతికి తన ఉద్యోగ వ్యతిరేకతను చెప్పకనే చెప్పినట్లయింది. ఉద్యోగులకు పెన్షన్ భిక్ష కాదు హక్కు. ప్రభుత్వంలో కొన్ని దశాబ్దాలపాటు చేసిన సేవకు ప్రతిఫలం. సామాజిక భద్రత. సుప్రీం కోర్టు ఇదే నొక్కివక్కాణించింది. ప్రభుత్వాలు ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్ ప్రభావంతో పెన్షన్‌ను రాజకీయ, ఆర్థిక కోణంలో చూస్తున్నాయి.

# జగనన్న ఆరోగ్య సురక్ష కు విశేష స్పందన..



ప్రజాపాలన ప్రతినిధి కొవ్వూరు: తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలోని పెద్దేవం గ్రామం లో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు రాష్ట్ర కాపు జెసి నాయకులు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ తిగిరిపల్లి వెంకట్రావు అధ్యక్షతన జడ్.పి.హెచ్ హైస్కూల్లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో తోటరామకృష్ణ గారు మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష ప్రతి పేదవాడు ఎంతగానో ఉపయోగపడుతుందని అలాగే ఈ అవకాశాన్ని ప్రతి ఒకరు ఉపయోగించుకోవాలని తెలియజేశారు అలాగే ఈ గ్రామానికి చెందిన ఒరిగేటి శ్రావ్య శ్రీ మరియు తిగిరిపల్లి లిల్లీగ్రేసి ఈ విద్యార్థులు దీర్ఘకాల వ్యాధితో బాధపడుతున్నారు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో మూడో తారీఖున దెందులూరు లో జరగనున్న నేను సిద్ధం కార్యక్రమంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి కి తెలియజేసి వైద్యం నిమిత్తం మొత్తం ఖర్చును సీఎం సహాయ నిధి నుండి అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ,మండల ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు,బల్లిపాడు సర్పంచ్ ఏలిన శివరామకృష్ణ,తాడిపూడి సర్పంచ్ నామ శ్రీనివాస్,తాళ్లపూడి సర్పంచ్ నక్క చిట్టిబాబు,తిరుగుడు మెట్ట సర్పంచ్ వల్లభ శెట్టి చిన్ని,మాజీ ఏ.యం.సి చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్ అన్నదేవరపేట సర్పంచ్ ఎలిపే రాజు,గజ్జరం ఎంపిటిసి చిన్నబ్బాయి,పంచాయతీ కార్యదర్శి అలేఖ్య సువర్చల,తాళ్లపూడి మండలం వైఎస్ఆర్సిపి పార్టీ అధ్య తాళ్లపూడి మండల కాపు సంఘం అధ్యక్షులు నామ సూర్యనారాయణ రావు,చాగల్లు మండలం జడ్పిటిసి గారపాటి శ్రీను, ఏ. యం.సి చైర్మన్ సూరిబాబు,ఏఎంసీ వైస్ చైర్మన్ కొలిశెట్టి నాగేశ్వరరావు,తాడిపూడి సర్పంచ్ నామ గోపాలం,నామ ప్రకాష్, వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీ అధ్యక్షులు చింత వెంకటస్వామి,వార్డు మెంబర్లు మైలవరపు రాధాకృష్ణ, ఎండపల్లి పద్మావతి,ఎండపల్లి లక్ష్మణరావు గారు కొయ్య మంగ,పట్టప సువర్ణ కుమారి వైఎస్ఆర్సిపి నాయకులు వేణుగోపాలకృష్ణ మేము రామారావు,బెజవాడ వీర్రాజు,ఎండపల్లి వీర వెంకట సత్యనారాయణ,నా మన వీర వెంకట రావు,కవుల నాగేశ్వరావు,ఇంటి నాగేశ్వరావు, బట్టు సుబ్బారావు ,చామకూరి సత్యనారాయణ,ఘంటసాల మనీ బాబు కార్యకర్తలు అభిమానులు మరియు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో ఉదయభానుని 25 వేల మెజా ర్టీతో గెలిపించాలి ఎంపీ కేశినేని శ్రీనివాస్



జగ్గయ్యపేట జనవరి 30 ప్రజా పాలన ప్రతినిధి పట్ట ణం బి కన్వెన్షన్ నందు నియోజకవర్గ స్థాయి ఆత్మీ య సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా విజయవాడ ఎంపీ కేశి నేని శ్రీనివాస్ నాని పాల్గొన్నారు. ముందుగా నియోజ కవర్గ వైఎస్ఆర్సిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కా ర్యకర్తలతో పరిచయ కార్యక్రమం నిర్వహించరుఈ సందర్భంగా ఎంపీ కేశినేని శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో 5వేల మెజారిటీతో ఉదయభానుని గె లిపిం చిన మీరు రానున్న ఎన్నికల్లో 25 వేల మెజారిటీతో గెలిపించి క్యాబినెట్లో మినిస్టర్ గా చూడాలన్నారు. ఉ దయభాను నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంత దూ రమైనా వెళ్తారని నేను ప్రతిపక్ష ఎంపీగా ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో తరచూ నాతో చర్చించి అభి వృద్ధి పనులకు నిధులు సమకూర్చుకునే వారన్నారు. అందుకు ఇదే నిదర్శనం అన్నారు. ప్రజా సమస్యలకు నిరంతరం పోరాడే ఉదయభాను గారు పేట చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతారన్నారు. ఇక్కడ అభివృద్ధి సం క్షేమం కోసం స్వయంగా ముఖ్యమంత్రి జగ న్మోహన్ రెడ్డి వద్దకే వెళ్లి సాధించుకునే సామర్థ్యం, సత్తా ఉద యభానుకి ఉందని, కేంద్రంలో ప్రధానమంత్రి వద్దకు వెళ్లి సాధించే సత్తా నాకు ఉందన్నారు. రానున్న ఎన్ని కల్లో 25 వేల మెజారిటీతో నియోజకవర్గ ప్రజలు ఉద యభానుని గెలిపించుకోవాలని కోరారుఈ సంద ర్భంగా ఉదయభాను మాట్లాడుతూఎంపీగా కేశినేని నాని ఈ ప్రాంతంలో గెలిస్తేనే జగ్గయ్యపేట నియోజ కవర్గం సంపూర్ణ స్థాయిలో అభివృద్ధి చెందుతుందని, అలాగే ప్యాసింజర్ రైలు కోసం గత మూడేళ్లుగా మ నకు విజయవాడ వైసీపీ ఎంపీ లేనప్పటికీ పోరాటం చేస్తున్నానని, ఇప్పుడు మనకు ఎంపీగా కేశినేని నాని ఉంటే ప్యాసింజర్ రైలు కోసం కేంద్రంలో పట్టుబట్టి త్వరితగతిన మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. నాడు జగ్గయ్యపేట ఎలా ఉందో నేడు జగ్గయ్యపేట ఎలా ఉందో ప్రజలు తెలుసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో జగ్గయ్యపేటలో మరింత అభివృద్ధి చేస్తామ న్నారుఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకు లు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు

## బాపట్ల పార్లమెంట్ టిడిపి అభ్యర్థిగా ముందు వరుసలో అద్దేపల్లి గణపతి



అద్దంకి ప్రజాపాలన ప్రతినిధి : బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా అద్దేపల్లి గణపతి పోటీ చేస్తున్నట్లుగా నియోజకవర్గంలో పుకార్లు షికారు చేస్తున్నాయి. అద్దేపల్లి అమరావతి ప్రాంతంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్నారు. గణపతికి నారా లోకేష్ తో చంద్రబాబు నాయుడుతో సత్ సంబంధాలు బాగా ఉన్నాయి. గణపతి మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు. వీరి భార్య మాల సామాజిక వర్గానికి చెందినవారు. ఈక్వేషన్స్ గణపతికి బాగా కలిసి వచ్చే అంశం దాదాపు నాలుగుసార్లు మాల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకి బాపట్ల పార్లమెంట్ టికెట్ ఇస్తూ వస్తుంది టిడిపి. అయితే 2004 పార్లమెంట్ ఎన్నికల్లో వైసిపి మాదిగ సామాజిక వర్గానికి చెందిన సురేష్ కి టిక్కెట్ ఇవ్వడంతో క్రాస్ ఓటింగ్ లో ఆయన గెలుపొందారు. నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు నియోజకవర్గాలు టిడిపి గెలువగా మూడు అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి గెలిచింది .దీని ప్రకారం బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి కూడా టిడిపి అభ్యర్థి గెలవాలి కానీ వైసీపీ గెలిచింది దీని దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు నాయుడు కూడా బాపట్ల పార్లమెంటు అభ్యర్థిని మాదిగ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి ఇవ్వాలని దాదాపు నిర్ణయించినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంకా ఈ రేసులో ఎంఆర్పిఎస్ మాజీ నాయకులు టిడిపి అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు వర్ల రామయ్య ఉండవల్లి శ్రీదేవి తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు .ముందు వరుసలో అద్దేపల్లి గణపతి ఉ న్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అద్దేపల్లి ఇటీవలే బాపట్ల నియోజకవర్గంలో పర్యటిస్తూ సామాజిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు, పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ, పేద వర్గాలకు దుప్పట్లు, దుస్తులు ఆయా నియోజకవర్గాల్లో పంపిణీ చేసినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. బాపట్ల పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తను సామాజిక కార్యక్రమాల ద్వారా చాప కింద నీరులా విస్తరిస్తున్నారు. బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్ నాయకులతో టచ్ లో ఉన్నాడని సమాచారం .ఏది ఏమైనప్పటికీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం టికెట్ విషయంలో అద్దేపల్లి గణపతి ముందు వరుసలో ఉన్నారని నియోజకవర్గంలోని రాజకీయ నాయకులు తన అభిమానులు చర్చించుకుంటున్నారు.

# క్యాండెడేట్లు ఫైనల్?!

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి, : తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసింది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు కసరత్తు పూర్తి చేశారు. తెలుగుదేశం పార్టీ బరిలోకి దిగనున్న స్థానాలకు సంబంధించి అభ్యర్థుల వడపోత ప్రక్రియను దాదాపు పూర్తి చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికి ఎన్నికల సమర శంఖాన్ని పూరిస్తూ 'రా కదలిరా' పేరిట ప్రచార సభలను నిర్వహిస్తున్న చంద్రబాబు విరామ సమయంలో అభ్యర్థుల వడపోత ప్రక్రియను పూర్తి చేశారు. దాదాపు 90 నుంచి 95 శాతం అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఐవీఆర్ఎస్తో పాటు పలు సర్వే సంస్థల నివేదికల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరిగింది. అంతేకాకుండా చంద్రబాబు సొంతంగా పార్టీ నేతలకు కూడా తెలియకుండా అభ్యర్థుల ఎంపిక.. నియోజకవర్గాల్లో పరిస్థితులపై ప్రత్యేక సర్వేలను చేయించారు. ఇవన్నీ ఓ కొలిక్కి రావడంతో బహిరంగ సభల విరామ సమయంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. ఇప్పటికే టీడీపీ – జనసేనకు సంబంధించిన అభ్యర్థుల ఉమ్మడి జాబితాలను ప్రకటించాలని ఆ రెండు పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి. వాస్తవంగా ఇప్పటికే జాబితా విడుదల పూర్తి కావలసి ఉన్నప్పటికి పలు కారణాలు, అవాంతరాల వల్ల వాయిదాపడుతూ వస్తోంది.

**ఆశావహుల పోరు**

మరోవైపు ఆశావాహుల పోరు అధికంగా ఉన్న స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక పార్టీకి కత్తిమీద సాములా మారింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఆచితూచి అడుగులు వేస్తు రీ సర్వేలను చేయించారు. అలాగె ఐవిఆర్ఎస్ సర్వేను కూడా చేపట్టి కార్యకర్తలు ద్వితీయ శ్రేణి నాయకత్వాల అభిప్రాయ సేకరణ చేశారు. నియోజకవర్గంలో ఆయా నేతలకు ఉన్న పట్టు ఇతర అంశాలను పూర్తి స్థాయిలో సేకరించి గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చారు. ఇంకొక వైపు బీజేపీతో పొత్తు అంశం ఖరారు కాకపోవడంతో జాభితా విడుదలలో జాప్యం చోటుచేసుకుంది. ప్రస్తుత పరిణామాల ప్రకారం మరో రెండు మూడు రోజుల్లోనె బీజెపీతో పొత్తు అంశం ఓ కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

**50 సీట్లతో జాబితా రెడీ**

అధికార వైసీపీ ఇప్పటికే 5 విడతలుగా అభ్యర్థుల ప్రకటన చేసింది. ఈ నేపథ్యంలో టీడీపీ కూడా అభ్యర్థులను ప్రకటించాలని నిర్ణయానికి వచ్చింది. బీజేపీతో పొత్తు అంశం కొలిక్కిరాకపోయినా ఇబ్బందులేని స్థానాలతో జనసేన పోటీ చేసే నియోజకవర్గాల జాభితాను విడుదల చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. దాదాపు 50 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదలకు అవకాశం ఉంది. తొలుత 90 మందితో తొలి లిస్టును ప్రకటించాలని భావించిన టీడీపీ అధిష్టానం ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో సిట్టింగుల తో పాటు మరికొన్ని నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించాలని నిర్ణయం తీసుకుంది. ఇక సామాజిక సమీకరణాలు, నియోజకవర్గాల్లో పరిస్థితులకు అనుగుణంగా కొన్ని మార్పులు చేర్పులతో తొలి జాభితాను చంద్రబాబు సిద్ధం చేస్తున్నట్లు విశ్వనీయ సమాచారం. ఈ జాభితాను ఫిబ్రవరి 4 లేదా 5వ తేదీన ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం

**ఎంపీ స్థానాలపైనా.. కసరత్తు**

ఇక ఎంపీ స్థానాలకు సంబంధించి అభ్యర్థులను ఖరారు చేసే అంశంపై కూడా చంద్రబాబు దృష్టి పెట్టారు. తొలి జాభితాలో ఐదు నుంచి ఆరు పార్లమెంటు స్థానాల అభ్యర్థుల ప్రకటన ఉంటుందని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికి వచ్చే నెల మొదటి వారంలోనె తొలి జాభితాను విడుదల చేసి ఇటు నేతలు అటు కేడర్లో ఉన్న టెన్షన్కు రిలీఫ్ ఇచ్చె ఆలోచనలో టీడీపీ అధిస్టానం ఉంది.

## వాహనాల్లో అధిక ప్రయాణికులను ఎక్కించి ప్రమాదాలకు గురికావద్దు...

నూజివీడు, జనవరి 30, ప్రజాపాలన ప్రతినిధి: వాహనాల్లో అధిక ప్రయాణికులను ఎక్కించి ప్రమాదాలకు గురికావద్దని మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ జి.నాగమురళి అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ శక్తి భవన్లో 35వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా "రహదారి భద్రత–మనందరి బాధ్యత" అనే అంశంపై పట్టణంలోని ఆటో, మోటార్ క్యాబ్ డ్రైవర్లతో, యజమానులతో రహదారి భద్రతపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ నాగమురళి మాట్లాడుతూ 18 ఏళ్ళ వయసు నిండిన వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతి ఒక్కరూ స్పందించి రోడ్డు ప్రమాద బాధితులను కాపాడాలని, కాపాడిన వారికి రూ.5,000 లు నగదు బహుమతి, ఆపద్బాంవుడుగా గుర్తించి ఒక సేవాపత్రం కూడా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి డిఎం సూర్య పవన్ కుమార్, కార్యాలయ సిబ్బంది, ఆటో, మోటార్ క్యాబ్ డ్రైవర్లు, యజమానులు, తదితరులు పాల్గొన్నారు.


























**కావలెను**

స్నేహ గ్రూప్ విజయవాడ, గుంటూరు, వైజాగ్ హైదరాబాద్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. నెలకు రూ.15,000/- జీతం, ట్రావెలింగ్ అలవెన్సు, ఇన్సెంటివ్ ఇవ్వబడును. ఆసక్తి గలవారు మీ వివరాలని ఈ క్రింది నెంబర్ కి వాట్సాప్ చేయగలరు.
7660027683, 91549 58315

# శరవేగంగా కులగణన...

రాజమండ్రి, జనవరి 30 ప్రజాపాలన ప్రతినిధి : ఏపీలో కుల గణన శరవేగంగా పూర్తవుతుంది. మరో వారంలో రాష్ట్ర వ్యాప్తంగా కులగణన పూర్తి చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయాలు కసరత్తు చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల వేళ ఏపీ ప్రభుత్వం చేపట్టిన కులగణనపై విపక్షాలు రకరకాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నా ఈ కార్యక్రమం చాలా సులువుగా పూర్తవుతోంది. ప్రజలు తమ వివరాలను వెల్లడించకుండానే వాలంటీర్లు ఈ పని పూర్తి చేసేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వద్ద ఇప్పటికే ప్రతి ఒక్కరి వివరాలు పక్కాగా అందుబాటులో ఉన్నాయి. 2016లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర సాధికార సర్వే ద్వారా ప్రతి ఇంటి వివరాలను సేకరించి రియల్ టైమ్ డేటాను అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా రాష్ట్రంలో నివసించే ప్రతి పౌరుడి వివరాలను ఏడేనిమిదేళ్ల క్రితమే ప్రభుత్వం సేకరించింది. సాధికార సర్వేలో ప్రజల స్థితిగతులను అధ్యయనం చేసే పేరుతో నిరంతరం డేటా అప్డేట్ చేస్తూ వచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అన్ని రకాల వివరాలు సేకరించారు. ఆ తర్వాత 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 అక్టోబర్ నుంచి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 2019 అక్టోబర్ 2న వాలంటీర్ వ్యవస్థను ప్రారంభించి 2020 జనవరి నాటికి దానిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం సచివాలయాల్లో లక్షా 35వేల మంది ఉద్యోగులు, 2.65లక్షల వాలంటీర్లు ఉన్నారు. ప్రతి యాభై ఇళ్లకు ఓ వాలంటీర్ సేవలు అందిస్తున్నాడు. వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్ల క్రితమే ప్రతి కుటుంబం వివరాలను అన్ని వివరాలు, ఆధార్ కార్డులతో సహా జియో మ్యాపింగ్ పూర్తి చేశాయి. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు ప్రతి కుటుంబం వివరాలు వాటి కులంతో సహా పక్కాగా లెక్కలు ఉన్నాయి. ప్రభుత్వం వద్ద ఉన్న గణంకాలను సామాజిక వర్గాల వారీగా ప్రకటించడానికి అవకాశం లేదు. దేశ వ్యాప్తంగా జనగణన పూర్తి కాకపోవడంతో పాటు రాజకీయ కారణాల నేపథ్యంలో కులాల వారీగా జనాభాను అధికారికంగా ప్రకటించడానికి వీల్లేకుండా పోయింది. దీంతో గత ఏడాది చివర్లో కులగణన చేపట్టాలని



నిర్ణయించారు. జనవరి 19 నుంచి నిర్వహిస్తున్న కులగణన గ్రామ, వార్డు వాలంటీర్లే నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ఎంత సులువుగా జరిగిపోతుందంటే ప్రతి ఇంట్లో ఒకరి నుంచి బయోమెట్రిక్ తీసుకుంటే సరిపోతోంది. వాలంటీర్లు ఎలాంటి వివరాలు అడగకుండానే కులగణన పూర్తి చేస్తున్నారు. ఎవరైనా అందు బాటులో లేకపోయినా వారి ఫ్యామిలీకి మ్యాపింగ్ జరిగిన నంబర్‌కు ఫోన్ చేసి ఓటీపీ చెప్పమని అడుగుతున్నారు. ఓటీపీ చెబితే కులగణన పూర్తైనట్టేనని వివరిస్తున్నారు. కులాల వారీగా ప్రజల వివరాలు ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఉన్నా వాటిని బహిర్గతం చేయడానికి వీల్లేకుండా పోయింది. ఇప్పుడు అధికారికంగా క్యాబినెట్ అమోదంతో నిర్వహిస్తున్న కులగణన మరో వారం రోజుల్లో పూర్తైతే దానిని ప్రభుత్వం అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంటుంది. తద్వారా సమాజంలో అన్ని వర్గాలకు ప్రభుత్వం పథకాలను వర్తింప చేసే వీలు కలుగుతుందని చెబుతున్నారు. గతంలో నిర్వహించిన సర్వేల ప్రకారం రాష్ట్రంలో 1.67 కోట్ల కుటుంబాలు.. 4.89 కోట్ల జనాభా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. తాజా కులగణన సర్వేతో అన్ని కులాలకు ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా చేయూత అందించడానికి వీలువుతుందని ప్రభుత్వం చెబుతోంది. ప్రభుత్వ పథకాలు అందకుండా ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోయినా దీని ద్వారా తెలుస్తుంది. తద్వారా వారికీ లబ్ధి చేకూర్చేందుకు వీలవుతుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ గతంలో వలంటీర్ల ద్వారా సేకరించిన డేటా ప్రకారం రాష్ట్రంలో గ్రామాల్లో 1,23,40,422 కుటుంబాలకు చెందిన 3,56,62,251 మంది నివాసం ఉంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో 44,44,887 కుటుంబాలలో 1,33,16,091 మంది నివసిస్తున్నారు. మొత్తం 1.67 కోట్ల కుటుంబాలకు సంబంధించి 4.89 కోట్ల మంది ప్రజలు ఉన్నారు. సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఇంటింటి వివరాలు సేకరణ పూర్తి చేశారు. కులగణనలో వివిధ కారణాలతో నమోదు చేసుకోకుండా మిగిలిన వారి కోసం ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు సంబంధిత కుటుంబాలకు చెందిన వారు ఎవరైనా ఒకరు వెళ్లి వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. కులగణన ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేకంగా ఒక మొబైల్ యాప్‌ను సిద్ధం చేసింది. దాదాపు 723 కులాల జాబితాలను ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీల వారీగా వర్గీకరించి మొబైల్ యాప్‌లో అనుసంధానించారు. ఓసీ, బీసీ, ఎస్టీ, ఎస్సీ కేటగిరీలో పేర్కొన్న 723 కులాలతో పాటు మరో మూడు కులాలు బేడ జంగం లేదా బుడగ జంగం, పిరమలై కల్లర్ (తేవర్), యలవ కులాలకు సంబంధించిన వారి వివరాలను వేరుగా అదర్స్ కేటగిరిలో సేకరిస్తారు.

కులం వివరాలు వెల్లడించడానికి ఆసక్తి చూపనివారికి, కుల పట్టింపులు లేని వారి కోసం నో- క్యాస్ట్ కేటగిరీని కూడ కులగణన ప్రక్రియలో చేర్చారు. కులగణన అయా కుటుంబాలు వెల్లడించే వివరాల ఆధారంగా డేటీ నమోదు చేసిన అనంతరం కుటుంబంలో ఎవరైనా ఒకరి నుంచి ఆధార్‌తో కూడిన ఈ -కే వైసీ తీసుకోనున్నారు. ఈ కేవైసీ కోసం బయోమెట్రిక్, ఐరిస్ తదితర విధానాలకు అవకాశం కల్పించారు

# ఇబ్బందుల్లో మాల్దీవులు...



మాల్దీవ్స్ అధ్యక్షుడి మహమ్మద్ ముయిజూని పదవీ గండం చుట్టుకుంది. ప్రతిపక్ష పార్టీ డెమక్రాటిక్ పార్టీ ఆయనపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. పార్లమెంట్‌లో మెజార్టీ సీట్లున్న ఎండిపి అభిశంసన తీర్మానంపై సంతకాల సేకరణ మొదలు పెట్టింది. అవసరానికి మించి చైనాకి దగ్గరవుతున్నారని ప్రతిపక్ష పార్టీ తీవ్రంగా ఆరోపిస్తోంది. దీనికి తోడు ఈ మధ్య చైనాకి చెందిన ఓ స్పై షిప్ మాల్దీవ్స్‌కి వచ్చేందుకు అధ్యక్షుడు ముయిజూ అనుమతినిచ్చారు. ఇది ఈ అసహనాన్ని మరింత పెంచింది. పార్లమెంట్‌లో దీనిపై ఘర్షణ కూడా జరిగింది. కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును ప్రతిపక్ష పార్టీ ఎంపీలు వ్యతిరేకించారు. ఓటును వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఎండీపీ పార్టీ ఎంపీ ఇసాపై అధికార పీఎన్‌సీ పార్టీ ఎంపీ షహీమ్ దాడికి పాల్పడ్డారు. కాళ్ల పట్టుకుని కిందపై పడేశారు. దీంతో షహీమ్‌పై ఇసా పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. ఈ పరిణామంతో పార్లమెంట్‌లో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఇసా దాడిలో షహీమ్ తీవ్రంగా గాయపడడంతో... ఆస్పత్రికి తరలించారు. అనంతరం పార్లమెంట్‌లో చర్చ జరిగింది. మాల్దీవుల పార్లమెంటు అట్టుడికిపోయింది. ప్రజాప్రతినిధులు రౌడీల్లా కొట్టుకున్నారు. పార్లమెంట్ సభ్యుల ముష్టిఘాతాలు, తోపులాటలతో రణరంగాన్ని తలపించింది. కెబినెట్ తీసుకున్న నిర ్ణయంపై పార్లమెంటులో ఆదివారం ఓటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. అధికార, విపక్ష ఎంపీలు సభలో గందరగోళం సృష్టించారు. పోడియంపైకి దూసుకెళ్లిన కొందరు సభ్యులు....స్పీకర్ కార్యకలాపాలను అడ్డు తగిలారు. స్పీకర్‌తో పాటు అక్కడున్న వారితో గొడవకు దిగారు. బెంచీల పైనుంచి నడుచుకుంటూ దూసుకెళ్లారు. స్పీకర్‌ను కూర్చీలో నుంచి పడేసేందుకు ప్రయత్నించారు. ఎండిపి ఎంపి ఇసా, పివిఎన్సీ ఎంపీ అబ్దుల్లా షహీమ్ అబ్దుల్ హకీమ్ మధ్య గొడవ జరిగింది. ఎంపీలు ఒకరిపైఒకరు ముష్టిఘాతాలు కురిపించుకున్నారు. ఇద్దరు ఎంపీలు కిందపడిపోయారు. తనను పట్టుకున్న ఎంపీని...మరో ఎంపీ బూటు కాళ్లతో తన్నాడు. మార్షల్స్, భద్రతా సిబ్బంది వచ్చి వారిని చెదరగొట్టారు. మాల్దీవుల ఎన్నికల్లో చైనా అనుకూలవాదిగా పేరొందిన మాజీ అధ్యక్షుడు యామీన్ సన్నిహితుడు మహ్మద్ ముయిజ్జు విజయం సాధించారు. కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును ప్రతిపక్ష పార్టీ ఎంపీలు వ్యతిరేకించారు. ఓటును వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఎండీపీ పార్టీ ఎంపీ ఇసాపై అధికార పీఎన్‌సీ పార్టీ ఎంపీ షహీమ్ దాడికి పాల్పడ్డారు. కాళ్ల పట్టుకుని కిందపై పడేశారు. దీంతో షహీమ్‌పై ఇసా పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. ఈ పరిణామంతో పార్లమెంట్‌లో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఇసా దాడిలో షహీమ్ తీవ్రంగా గాయపడడం తో...ఆస్పత్రికి తరలించారు. అనంతరం పార్లమెంట్‌లో చర్చ జరిగింది. మాల్దీవులు భారత పశ్చిమ తీరానికి సమీపంలోనే ఉన్నాయి. మధ్య ఆసియా నుంచి తూర్పు ఆసియాకు వెళ్లే కీలకమైన సముద్ర మార్గానికి మాల్దీవులు సమీపంలోనే ఉన్నాయి. మాల్దీవులు చిన్న దేశం కావడంతో భారత్ ఎక్కువగా సాయం చేసింది. మాల్దీవులు అన్ని రకాలుగా భారత్‌పై ఆధారపడుతుంది. ఆ దేశ పర్యాటకుల్లో ఎక్కువ భాగం భారతీయులే. మాల్దీవులకు చెందిన వేలాది మంది ప్రజలు భారత్‌కు వచ్చి ఉపాధి పొందుతున్నారు. మొన్నటి దాకా అధికారంలో ఉన్న ఇబ్రహీం సోలిహ్ సైతం భారత్‌తో సన్నిహిత సంబంధాలకు కృషి చేశారు. గతంలో యామీన్ అధికారంలో ఉన్న సమయంలో మాల్దీవులకు ఉదారంగా రుణాలిచ్చి కొన్ని దీవుల్లో పాగా వేసేందుకు యత్నించింది. అయితే కొంత కాలం తరువాత జరిగిన ఎన్నికల్లో యామీన్ ఓడిపోవడంతో చైనా పన్నాగాలు ఫలించలేదు. తాజాగా మళ్లీ యామీన్ సన్నిహితుడు అధికారంలో రావడంతో డ్రాగన్ తన పన్నాగాలను అమలుచేసే అవకాశముంది. మాల్దీవుల్లో చైనా ఎలాంటి చర్యలకు పాల్పడినా భారత భద్రతపై పెను ప్రమాదం చూపించే అవకాశముంది. కొద్ది రోజులుగా భారత్, మాల్దీవ్స్ మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ లక్షద్వీప్ పర్యటన తరవాత ఇవి మొదలయ్యాయి. మాల్దీవ్స్ మంత్రులు కొందరు ప్రధాని మోదీపై నోరు పారేసుకున్నారు. ఫలితంగా చాలా మంది బాయ్ కౌట్ మాల్దీవుల అంటూ సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టారు. చాలా మంది మాల్దీవ్స్ ట్రిప్‌ని క్యాన్సిల్ చేసుకున్నారు. ఆ తరవాత ఆ దేశ అధ్యక్షుడు మహమ్మద్ ముయిజూ చైనాలో పర్యటించారు. రెండు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. ఈ పర్యటన తరవాత ఆయన చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా భారత్‌నే ఉద్దేశించి ఉండడం ఇంకాస్త ఆగ్రహాన్ని పెంచింది. తమది చిన్న దేశమే అన్న చిన్న చూపు చూడొద్దని, అలాంటి కవ్వించే హక్కు ఎవరికీ లేదని తేల్చి చెప్పారు. అయితే...భారత్ పేరు ప్రస్తావించకుండానే ఈ వ్యాఖ్యలు చేశారు.

## తల్లి సెంటిమెంట్ వర్క్ అవుట్ అవుతుందా



కడప, జనవరి 30, ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు షర్మిల రూపంలో పెద్ద సవాలే ఎదురవుతోంది. ఒకపక్క ప్రతిపక్షాలు చేసే విమర్శలకు సమాధానాలు చెప్పడంతోపాటు మరోపక్క జగన్ చెల్లెలు షర్మిల సంధించే బాణాలకు కూడా స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజకీయపరమైన విమర్శలకు పార్టీ నాయకులు సమాధానం చెప్పేందుకు వైసీపీ నాయకులు సిద్ధంగా ఉన్నారు. కానీ, షర్మిల చేస్తున్న కుటుంబపరమైన విమర్శలు, ఆరోపణలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ఆ కుటుంబ సభ్యులుపైనే ఉంటుంది. షర్మిల చేస్తున్న ఆరోపణలపై సీఎం జగన్ స్పందిస్తే షర్మిలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించినట్టు అవుతుంది. ఈ నేపథ్యంలో వైసీపీ షర్మిలను రాజకీయంగా, వ్యక్తిగతంగా ఎదుర్కొనేందుకు వైసీపీ వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేస్తోంది. ఇప్పటికే రాజకీయ విమర్శలను ఎక్కుబెట్టిన షర్మిల.. తాజాగా కుటుంబ పరమైన విమర్శలు, ఆరోపణలను తీవ్రతరం చేసింది. ఇవన్నీ వైసీపీని ఇరకాటంలో పెట్టేలా ఉంటున్నాయి. దీంతో అప్రమత్తమైన వైసీపీ అధిష్టానం షర్మిలకు చెక్‌పెట్టేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో అన్నా, చెల్లెలు మధ్య సాగుతున్న రాజకీయ రణక్షేత్రాన్ని ఏ తల్లి కూడా స్వాగతించదు. కానీ, వైఎస్ విజయమ్మకు ఈ పరిస్థితి ఏర్పడింది. షర్మల కుటుంబ విషయాలను రోడ్డు మీదకు వచ్చి ఆరోపణలు చేస్తుండడంతో జగన్ తన తల్లి వద్ద ఇదే విషయాన్ని ప్రస్తావించినట్టు చెబుతున్నారు. తాను షర్మిలపై విమర్శలు చేయడం కంటే.. నువ్వే బయటకు వచ్చిన వాస్తవాలను చెప్పాలని కోరినట్టు చెబుతున్నారు. అదే సమయంలో పార్టీకి అండగా వచ్చే ఎన్నికల్లో ప్రచారాన్ని నిర్వహించాల్సిందిగా సీఎం జగన్‌తోపాటు ఇతర కుటుంబ సభ్యులు విజయమ్మను కోరినట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై విజయమ్మ సానుకూలంగా స్పందించారని చెబుతున్నారు. మంచి ముహూర్తం చూసి పార్టీ కోసం ప్రచారాన్ని నిర్వహిస్తారు. ఈ ప్రచారంలోనే వైఎస్ షర్మిల సీఎం జగన్‌పై చేస్తున్న అనేక విమర్శలు, ఆరోపణలకు విజయమ్మ సమాధానం చెబుతారని భావిస్తున్నారు. విజయమ్మ బరిలోకి దించడం ద్వారా రాజకీయంగా, వ్యక్తిగతంగా జగన్‌పై చేస్తున్న అనేక విమర్శలకు సమాధానం చెప్పినట్టు అవుతుందని వైసీపీ నాయకులు భావిస్తున్నారు. తల్లి, చెల్లిని చూడలేని వ్యక్తి రాష్ట్ర ప్రజలను ఏం చూస్తాడంటే చంద్రబాబు, పవన్ చేస్తున్న విమర్శలకు, తనకు అన్యాయం చేశాడంటూ షర్మిల మాట్లాడుతున్న మాటలకు విజయమ్మను రాజకీయ రణక్షేత్రంలో దించడం ద్వారా సమాధానం చెప్పినట్టు అవుతుందని వైసీపీ భావిస్తోంది. విజయమ్మతో సభలు, సమావేశాలు నిర్వహించడంతోపాటు అనేక ప్రాంతాల్లో సమావేశాలు పెట్టించేందుకు వైసీపీ సమాయత్తమవుతోంది. కూతురు, కొడుకు మధ్య జరుగుతున్న పోరును చూసి తీవ్ర ఆవేదన చెందుతున్న విజయమ్మను.. ఈ మేరకు ఒప్పించడంలో వైవీ సుబ్బారెడ్డ, ఆయన సతీమణితోపాటు వైఎస్ కుటుంబ సభ్యులు కీలకంగా వ్యవహరించినట్టు చెబుతున్నారు. షర్మిల రాకతో వైసీపీకి తగిలిన రాజకీయ డ్యామేజీని విజయమ్మ ద్వారా కొంతలో కొంతైనా పూడ్చుకునే ప్రయత్నాలను వైసీపీ చేస్తోంది. ఇవి ఎంత వరకు సత్ఫలితాలను ఇస్తాయో చూడాల్సి ఉంది.

## నాలుగేళ్ల పాటు భర్తలను మార్చుకొని కాపురం

లక్నో, జనవరి 30, ప్రజాపాలన ప్రతినిధి :ఇద్దరు యువతులు పరస్పర అంగీకారంతో తమ భర్తలను మార్చుకున్నారు. నాలుగేళ్ల పాటు ఈ బంధం కొనసాగింది. అంతా సజావుగా సాగింది కూడా. సీన్ కట్ చేస్తే.. ఓ యువతి తన భర్త వివాహేతర బంధంలో ఉన్న మహిళను పెళ్లి చేసుకున్నాడని ఆరోపించింది. తనకు న్యాయం చేయాలంటూ లఖ్‌నవూ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. బహ్రైచ్‌కు చెందిన ఓ యువతికి.. 2019లో ఓ యువకుడితో వివాహమైంది. వారిద్దరూ ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఇక నాలుగేళ్ల క్రితం సదరు యువతి.. తన భర్తతో కలిసి స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో స్నేహితురాలి భర్త కూడా అక్కడే ఉన్నాడు. నలుగురు కలిసి సరదాగా గడిపారు. క్రమంగా వీరి మధ్య చనువు మరింత పెరిగింది. అదే సంవత్సరం డిసెంబర్ ఈ రెండు జంటలు కలిసి క్రిస్మస్ పార్టీ జరుపుకున్నారు. ఈ కోవలోనే స్నేహితురాలిద్దరూ తమ భర్తలను మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. పరస్పర అంగీకారంతో ఈ బంధం నాలుగేళ్ల పాటు సజావుగా సాగింది. కానీ చిక్కు ఎక్కడొచ్చిందంటే.. బహ్రైచ్ యువతి భర్త తన భార్య స్నేహితురాలితో ప్రేమలో పడ్డాడు. ఇది కాస్తా అతడి భార్యకు తెలిసింది. ఈ విషయంపై భర్తను, స్నేహితురాలిని నిలదీసింది. దీంతో రెండు జంటల మధ్య గొడవలు పెరిగాయి. విడాకులు తీసుకోకుండా తన భర్త.. మరో మహిళను వివాహం చేసుకున్నాడని బహ్రైచ్ యువతి ఆరోపించింది. పలుసార్లు భర్తతో గొడవపడింది. అంతేకాకుండా అతడిపై కేసు పెట్టింది. దీంతో బహ్రైచ్ యువతి భర్త లఖ్‌నవూ ఫ్యామిలీ కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలు చేశాడు. ఆ తర్వాత దంపతులిద్దరికీ కౌన్సిలింగ్ ఇప్పించింది ఫ్యామిలీ కోర్టు. అయితే ఆమె భర్త ఏమో.. భార్యను బెదిరించడానికే మరో మహిళను పెళ్లి చేసుకున్నట్టు చెప్పానని.. నిజానికి తాను ఎవ్వరిని పెళ్లి చేసుకోలేదని చెప్పాడు. ప్రస్తుతం వీరిద్దరి కేసు విచారణ కోర్టులో సాగుతోంది.

# అవార్డు గ్రహీతల అభినందన సభ



అవనిగడ్డ ప్రజాపాలన జనవరి 30 (చల్లపల్లి )వివిధ డిపార్ట్మెంట్లో పనిచేసిన గణతంత్ర దినోత్సవ అవార్డు గ్రహీతలకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ప్రముఖఅంబేద్కర్ రిస్ట్ సీతారామరాజు అధ్యక్షత వహించారు. అవార్డు గ్రహీతలు చల్ల పల్లి సి.ఐ నాగప్రసాద్, పంచాయతీ సెక్రటరీ పి. మాధవేంద్రరావు, రైటర్ పవన్ కుమార్,జే. ఏ సంధ్య, ఆఫీస్ సబార్డినేటర్ రామలక్ష్మిలకు పూలే సంఘ సభ్యులు అడ్డాడ. ప్రసాద్ బాబు, కైకేపల్లి.దాస్, ఉప్పాల. సాంబశివరావు లు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ హరి రాజేంద్రప్రసాద్, సర్పంచ్ పి. కృష్ణకుమారి, ఉప సర్పంచ్ మమ్ము నేని. నాని, వక్కలగడ్డ పి.ఎ.సి.ఎస్ అధ్యక్షులు హనుమాన్ల. సురేంద్ర నాథ్ బెనర్జీ, డి.ఆర్ఓ. సి.సి వెంకటేశ్వరరావు, లంకే. బోస్ తదితరులు హాజరై ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ నీతి- నిజాయితీ గల ఆఫీసర్లు ప్రతి సంవత్సరం ఈ విధంగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు గ్రహీతల అవ్వాలని అన్నారు. పరిపాలన పరంగా మంచి పేరు తీసుకురావాలని కోరారు.

# రాజ్యసభ కోసం పార్టీల కసరత్తు

విజయవాడ, జనవరి 30, ప్రజాపాలన ప్రతినిధి :రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడటంతో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పార్టీలు లెక్కలేసుకుంటున్నాయి. ఇప్పటికే పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో అనర్హత వేటు అంశం కొలిక్కి చేరడంతో ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. వాస్తవంగా తెలుగుదేశం పార్టీకి రాజ్యసభ సీటు దక్కించుకునేంత బలం లేకపోయినప్పటికీ గత ఎమ్మెల్సీ ఎన్నికల మాదిరిగా ఏదొకటి జరగకపోతుందా అనే ఆశతో ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు రాజ్యసభ సభ్యుల స్థానాలు ఖాళీ అవుతున్నాయి.తెలుగుదేశం పార్టీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భారతీయ జనతాపార్టీ ఎంపీ సీఎం రమేష్ పదవీకాలం ముగుస్తుండటంతో రాష్ట్రంలో మూడు సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే రాజ్యసభ ఎన్నిలకు సంబంధించి షెడ్యూల్ కూడా విడుదల అయింది? సాధారణంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఈ మూడు ఎంపీ సీట్లను అసెంబ్లీలో పూర్తి మెజారిటీ కలిగిన వైసీపీ గెల్చుకోవాల్సి ఉంది. కానీ సార్వత్రిక ఎన్నికల వేళ మారిన పరిస్థితులతో వీటిపై ఉత్కంఠ నెలకొంది. మూడేళ్ల క్రితం తన పదవికి రాజీనామా చేసిన గంటా శ్రీనివాస్ రాజీనామానను అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆమోదించారు. అలాగే మూడేళగా పార్టీలు మారిన మరో 8 మంది ఎమ్మెల్యేలపై వచ్చిన అనర్హత వేటు ప్రక్రియ కూడా చివరి దశకు చేరుకుంది. స్పీకర్ నిర్ణయం వెలువడిన తర్వాత దానికను గుణంగా ఎమ్మెల్యేల లెక్క తేలనుంది. ఈలోగా మూడు సీట్లకు అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో పడ్డారు వైసీపీ అధినేత జగన్.ఏ రాష్ట్రంలో అయినా రాజ్యసభ ఎన్నికల్లో ఖాళీ అయిన సీట్లు, ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యే సీట్ల లెక్క ఆధారంగా నిర్ణయిస్తారు. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం మూడు స్థానాలు ఖాళీ అవుతున్నాయి. అసెంబ్లీలో మొత్తం సీట్లు 175 ఉన్నాయి. ఈ లెక్కన చూస్తే ఒక్కో సీటుకు 44 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం అవుతాయి. ఒకవేళ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడితే 8 మంది ఎమ్మెల్యేలతో పాటు గంటా శ్రీనివాస్ కూడా లెక్కలోకి వస్తారు. ఇక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి కూడా రాజీనామా చేశారు. ఈ లెక్కన పదిమంది ఎమ్మెల్యేలను తీసివేస్తే మిగిలిన 165 సీట్ల ప్రకారం ఒక్కో ఎంపీ అభ్యర్థికి 41 మంది ఓట్లు అవసరం అవుతాయి. ఎలా చూసినా అధికార వైఎస్సార్



కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఇబ్బంది ఏమీ ఉండదు.దీంతో ఈ మూడు స్థానాలు తమకే దక్కుతాయనే నమ్మకంతో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు అధినేత జగన్మోహన్ రెడ్డి. మొత్తం మూడు స్థానాలకోసం ముగ్గురు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిలో పాయకరావుపేట సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఉన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గొల్ల బాబూరావు మొదటి నుంచీ పార్టీపై, సీఎం జగన్ పై విధేయతగా ఉన్నారు. తాజాగా ఈయన స్థానంలో మరొకరికి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చి గొల్ల బాబూరావును రాజ్యసభకు పంపాలనే ఆలోచనలో సీఎం జగన్ ఉన్నట్లు తెలిసింది. ఇక ఒంగోలు మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పేరు కూడా దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. గతంలోనే రాజ్యసభకు వైవీ సుబ్బారెడ్డి పేరు పరిశీలించినప్పటికీ అప్పట్లో ఉన్న పలు సామాజిక సమీకరణాల్లో భాగంగా సుబ్బారెడ్డికి అవకాశం దక్కలేదు.ఈసారి వైవీకి సీఎం జగన్ అవకాశం ఇస్తారని తెలుస్తోంది. మరోవైపు చిత్తూరు జిల్లా సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. శ్రీనివాసులు ఇప్పటికే మూడుసార్లు సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చి వెళ్లారు. బలిజ సామాజిక వర్గంలో శ్రీనివాసులుకు మంచి పేరు ఉండటంతో ఈయన పేరు కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరో వైపు కడప జిల్లాకు చెందిన మేడా రఘునాధరెడ్డిని కూడా పెద్దల సభకు పంపించే ఆలోచనలో సీఎం జగన్ ఉన్నట్లు తెలుస్తోంది. రాజంపేట సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జున రెడ్డికి స్వయంగా సోదరుడు మేడా రఘునాధరెడ్డి? గతంలోనే రఘునాధరెడ్డికి అవకాశం ఇవ్వాలని సీఎం జగన్ అనుకున్నప్పటికీ మల్లిఖార్జున రెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వడంతో ఈయనకు చాన్స్ ఇవ్వలేదు.దీంతో ఈసారి రఘునాధరెడ్డికి అవకాశం ఇస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలో కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉన్నట్లు పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఈ నలుగురిలో త్వరలో ముగ్గరు పేర్లను అధిష్టానం అధికారికంగా ఖరారుచేసే అవకాశం ఉందంటున్నారు పార్టీలోని ముఖ్యనేతలు?ఈసారి జరుగుతున్న ఎన్నికలతో రాజ్యసభలో తెలుగుదేశం పార్టీ ప్రాతినిథ్యం పూర్తిగా కోల్పోనుండగా వైసీపీ బలం పెరగనుంది. టీడీపీ బరిలో వర్ల రామయ్య, కోనేరు సురేష్ గతంలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అనూహ్యంగా ఒక సీటు దక్కించుకుంది. టీడీపీ తరపున బరిలో నిలిచిన పంచుమర్తి అనురాధ గెలుపుతో ఒక ఎమ్మెల్సీ స్థానం కైవసం చేసుకున్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణ రెడ్డి,కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి,మేకపాటి చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఉండవల్లి శ్రీదేవి తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి ఓటు వేసారు. దీంతో వైఎస్సార్?సీపీకి భారీగా నష్టం జరిగింది. అయితే ఈసారి ఇలాంటి పరిస్థితి రాకుండా వైసీపీ జాగ్రత్త పడుతున్నప్పటికీ తెలుగుదేశం పార్టీ మాత్రం ఒక సీటు తమకే వస్తుందని ధీమా వ్యక్తం చేస్తుంది. అందుకే రాజ్యసభ ఎన్నికల్లో తమ అభ్యర్థిని బరిలో దింపుతామంటున్నారు ఆ పార్టీ నేతలు.తెలుగుదేశం పార్టీ గత ఎన్నికల్లో మొత్తం 23 స్థానాలు గెలవగా వారిలో నలుగురు ఎమ్మెల్యేలు వైసీపీ చెంత చేరారు. మరో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామాను స్పీకర్ ఆమోదించారు. దీంతో టీడీపీకి కేవలం18 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. అయితే ఎమ్మెల్యేల అనర్హత పై స్పీకర్ నిర్ణయం తీసుకుంటే ఒక్కో రాజ్యసభ స్థానానికి 41 మంది ఎమ్మెల్యేల బలం అవసరం ఉంటుంది. ఎలా చూసుకున్నా కూడా టీడీపీ విజయానికి అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. అయినా రాజ్యసభ ఎన్నికల కోసం ఇద్దరి పేర్ల పరిశీలిస్తుంది టీడీపీ అధిష్టానం. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్యతో పాటు టీడీఎల్పీ ఎలక్షన్ కోఆర్డినేటర్ కోనేరు సురేష్ పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అయితే తమకు బలం తక్కువగా ఉన్నప్పటికీ పోటీలో అభ్యర్థిని నిలబెట్టడానికి కారణం లేకపోలేదంటున్నారు ఆపార్టీ నేతలు.

## పైరేట్స్..తాట తీస్తున్న ఇండియన్ నేవీ




విశాఖపట్టణం, జనవరి 30, ప్రజాపాలన ప్రతినిది : అరేబియా మహా సముద్రంలో సముద్రపు దొంగలు మరోసారి రెచ్చిపోయారు. ఇటీవలనే విఫలయత్నం చేసిన సముద్రపు దొంగలు తాజాగా మరోసారి రెచ్చిపోయారు. తాజాగా ఇరాన్‌కు చెందిన 'ఎంవీ ఇమాన్' అనే నౌకను హై జాక్ చేశారు సోమాలియా సముద్రపు దొంగలు. అయితే ఆ సమాచారం అందుకున్న ఈ ఫిషింగ్ నౌకను సాహసోపేతంగా వ్యవహరించి కాపాడింది భారత నౌకాదళానికి చెందిన యుద్ధనౌక ఐఎన్ఎస్ సుమిత్ర.హైజాక్ విషయాన్ని బాధిత నౌక ఎంవీ ఇమాన్ క్రూ బాహ్య ప్రపంచానికి తెలియచేసిన వెంటనే తీర ప్రాంత గస్తీ విధుల్లో ఉన్న భారత రక్షణశాఖ వెంటనే స్పందించింది. నౌకలోని మొత్తం 17 మంది మత్స్యకారులను కాపాడింది. అరేబియా సముద్రంలో కొచ్చికి పశ్చిమాన 700 నాటికల్ మైళ్ల దూరంలో సోమాలియా సముద్రపు దొంగలు ఈ హైజాక్ కు పాల్పడ్డారు. సముద్రపు దొంగలు ఎంవీ ఇమాన్ నౌకను హైజాక్ చేసిన వెంటనే దాని నుంచి భారత యుద్ధనౌక ఐఎన్ఎస్ సుమిత్రకు ఎస్ఓఎస్ ? సేవ్ ఔర్ షిప్ అంటూ ఒక మెసేజ్ ఒక వచ్చింది. ఈ మెసేజ్ తో అలర్ట్ అయిన భారత యుద్ధనౌక ఐ ఎన్ ఎస్ సుమిత్ర వెంటనే బాధిత నౌక ను లోకేట్ చేసింది. తాను ఉన్న ప్రాంతానికి 100 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నట్టు గుర్తించింది. ఘటనా స్థలం దిశగా వేగంగా వెళ్లి రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించింది.తీర ప్రాంతం తో సాయుధ నావికా దళాలు వెంటనే బాధిత నౌక ను చుట్టి ముట్టాయి. వెంటనే సముద్రపు దొంగలను హెచ్చరికలను జారీ చేసింది. వెంటనే ఎం వీ ఇమాన్ నౌక లోకి భారత నౌకా దళం ప్రవేశించింది. భారత నౌకాదళ ప్రకోపాన్ని గుర్తించిన సముద్రపు దొంగలు ఫలాయనం చిత్తగించే మార్గాలు ప్రారంభించారు. కాసేపటికి ఇక భారత సైన్యాన్ని తట్టుకోలేమని భావించి వెనక్కు పారిపోవడానికి సిద్ధం అయ్యారు. అలా సముద్రపు దొంగలను తరిమికొట్టి ఇరాన్ ఫిషింగ్ నౌకను రక్షించింది ఐ ఎన్ ఎస్ సుమిత్ర.ప్రత్యేకించి అరేబియా సముద్రంలో దొంగల బెడద ఎక్కువైపోయింది. నెల క్రితం గల్ఫ్ ఆఫ్ ఎడెన్ సముద్ర జలాల్లో బ్రిటన్‌కు చెందిన యుద్ధనౌకపై యెమన్ హౌతీ మిలిటెంట్లు డ్రోన్ తో దాడి చేశారు. దాని నుంచి ఎస్ఓఎస్ మెసేజ్ అందుకున్న భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్ విశాఖ హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి బ్రిటన్ నౌకకు అంటుకున్న మంటలను ఆర్పేసి రక్షించిన వైనం ప్రపంచ దేశాల ప్రశంసలు పొందింది. ఆ ఘటన మరువక ముందే తాజా ఘటన లో మరోసారి భారత నౌకా దళం తన పౌరుషాన్ని చూపడం ప్రశంసనీయమైంది.

## ఐదో జాబితాపై గుబులు....

నెల్లూరు, జనవరి 30, ప్రజాపాలన ప్రతినిది :రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికార వైసీపీ ఐదో విడత అభ్యర్థులు ప్రకటనపై కసరత్తు చేస్తోంది. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో వైసీపీ పలు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ స్థానాల్లోనూ మార్పులు, చేర్పులు ఉండే అవకాశముందని సూచాయగా చెప్పింది. ఇక, మిగిలిన స్థానాలకు ఐదో విడతలోనే అభ్యర్థులను ప్రకటించేందుకు వైసీపీ అధిష్టానం సిద్ధమవుతోంది. ఈ క్రమంలో పలు అంశాలను పరిగణలోకి తీసుకుని లెక్కలు వేసుకుంటోంది. ఇందుకోసం సామాజిక సమీకరణలు, సర్వే లెక్కలు వంటి అంశాలను కూలంకుషంగా పరిశీలిస్తోంది. అన్నీ సవ్యంగా సాగితే రెండు, మూడు రోజుల్లోనే ఐదో విడత అభ్యర్థులు ప్రకటన ఉంటుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఐదో విడత అభ్యర్థులు ప్రకటన కోసం ఆశావహ అభ్యర్థులతోపాటు కేడర్ కూడా ఆశగా ఎదురు చూస్తోంది. వైసీపీ ఇప్పటి వరకు 10 పార్లమెంట్, 58 అసెంబ్లీ స్థానాలకు నాలుగు విడతల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ స్థానాల్లో చాలా చోట్ల కొత్త వారికి అవకాశాలు కల్పించిన వైసీపీ అనేక మందికి సీట్లు ఇచ్చేందుకు నిరాకరించింది. కొంత మందికి స్థానాలను మార్చింది. మరి కొందరికి పెండింగ్‌లో పెట్టింది. ఇంకొందరిని ఎంపీ అభ్యర్థులుగా బరిలో నిలుపుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీ ఐదో విడత జాబితా విడుదలకు సన్నద్ధమవుతోంది. రాష్ట్రంలోని అనేక నియోకజవర్గాల్లో ఈసారి భారీగా మార్పులు ఉండే అవకాశం కనిపిస్తోంది. మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా చేస్తున్న కొందరిని ఎంపీలుగా బరిలోకి దింపేందుకు జగన్ సిద్ధమవుతున్నారు. అనేక చోట్ల ఈసారి కొత్త ముఖాలకు చాన్స్ ఇచ్చే యోచనలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి.. ఆ మేరకు ఐదో జాబితాపై కసరత్తు పూర్తి చేసినట్టు చెబుతున్నారు. ఆయా అభ్యర్థుల ఆర్థిక, అంగ బలంతోపాటు జనాల్లో వారికి ఉన్న ఆదరణ వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రకటించాల్సిన స్థానాలు జాబితాలో 15 ఎంపీ, 117 అసెంబ్లీ సెగ్మెంట్స్ ఉన్నాయి. సుమారు 100 స్థానాల్లో ప్రకటించాల్సిన అభ్యర్థులపై స్పష్టతకు వచ్చిన అధిష్టానం.. మిగిలిన స్థానాలపై తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ స్థానాల్లో ప్రస్తుతం సీనియర్ నేతలు ప్రాతినిధ్యం వహిస్తుండడం, కొత్త వారు ఇక్కడ ప్రజల్లోకి వెళ్లి జోరుగా ప్రచారాన్ని సాగిస్తుండడంతో ఇక్కడ అభ్యర్థులు ఎంపిక అధిష్టానానికి ఇబ్బందిగా మారింది. పాత వారికి ఇస్తే విజయావకాశాలు తక్కువగా ఉండడం, కొత్త వారికి ఇస్తే సీనియర్లు కలిసి వచ్చే అవకాశాలు లేకపోవడం వంటి అంశాలతో ఏం చేయాలన్న దానిపై అధిష్టానం ఆలోచన చేస్తోందిఇప్పటికే ఆయా నియోజకవర్గాలపై రెండు, మూడుసార్లు సమావేశాలు నిర్వహించిన ముఖ్య నాయకులు..

## టీడీపీ నేతలకు టచ్ లోకి పార్థసారథి..?

విజయవాడ, జనవరి 30, ప్రజాపాలన ప్రతినిధి :పెనమలూరు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పార్థసారథి వచ్చే ఎన్నికల్లో ఎక్కడ నుంచి పోటీ చేస్తారనే దానిపై సస్పెన్స్ వీడింది. నూజివీడు టీడీపీ నేతలకు టచ్ లోకి వెళ్లారు. ఎలాగైన ఈ సారి మంత్రిగా ప్రమాణస్వీకారం చేయాలన్న లక్ష్యంతో ఉన్న సారథి... నియోజకవర్గం మారేందుకు రెడీ అయ్యారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పార్థసారథి... ఒకసారి బందరు పార్లమెంటు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2004లో ఉయ్యూరు అసెంబ్లీ స్థానం నుంచి గెలిచి వైఎస్సార్ కేబినెట్ లో మంత్రి పదవి దక్కించుకున్నారు. 2009లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు మళ్లీ మంత్రి పదవి దక్కించుకున్నారు. రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు అందించారు. 2014లో ఎంపీగా ఓడిపోయిన పార్థసారథి ఖాళీగానే ఉన్నారు. 2019లో మూడోసారి గెలిచిన ఆయనకు బీసీ కోటాతోపాటు సీనియర్ కాబట్టి మంత్రి పదవి దక్కుతుందని భావించి భంగపడ్డారు. తనకంటే జూనియర్ జోగి రమేశ్‌కు పార్టీ అధిష్టానం బీసీ కోటాలో మంత్రి పదవి ఇచ్చింది. దీంతో అసంతృప్తి చెందిన పార్థసారథి...చివరికి పార్టీ మారటానికి సిద్ధమయ్యారు. బీసీ సామాజిక బస్సు యాత్ర నుంచి సీఎం జగన్ పై విమర్శలు చేయటం ద్వారా... పార్టీని వీడుతున్నట్లు పార్థసారథి సంకేతాలు ఇచ్చారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి వైసీపీ నుంచి బయటకు వెళ్తున్న తొలి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆయనే. బీసీ ఎమ్మెల్యేగా ఉన్న పార్థసారథిని సాధ్యమైనంత వరకు పార్టీ నుంచి వెళ్లకుండా అధినాయకత్వం ప్రయత్నాలు చేసింది. అయినప్పటికీ పార్టీ నుంచి వెళ్ళటానికే సిద్ధమయ్యారు. ఆయన పార్టీ మారటానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ... ప్రధాన కారణం మాత్రం వైసీపీలో మంత్రి పదవి దక్కకపోవటమేనని తెలుస్తోంది. అధిష్టానం 2014లో ఎంపీగా వెళ్ళమంటే వెళ్ళానని, పార్టీ రాష్ట్ర కార్యాలయం కోసం బెజవాడలో తన స్థలాన్ని ఇచ్చానని పార్థసారథి అంటున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేయటంతో బీసీల్లో తన సామాజిక వర్గం ఎక్కువ ప్రభావం చూపిందని అంటున్నారు. పార్టీ తనకు మంత్రి పదవి ఇవ్వక పోవటాన్ని పార్థసారథి జీర్ణించుకోలేక పోయారని సన్నిహితులు చెబుతారు.పార్థసారథి వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరాలనే నిర్ణయం వెనుక కూడా మంత్రి పదవే కీలక పాత్ర పోషిస్తోందనేది పొలిటికల్ సర్కిల్స్ లో జరుగుతున్న చర్చ. తనతోపాటు పలువురు వైసీపీ ఎమ్మెల్యేలు కూడా టీడీపీలో చేరతారని... తన సామాజిక వర్గం బలంగా ఉన్న చోట వైసీపీ అభ్యర్థుల ఓటమికి పనిచేస్తానని పార్థసారథి టీడీపీకి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే తనకు టీడీపీ అధికారంలోకి వస్తే మంత్రి పదవి ఇవ్వాలని సారథి కోరినట్టు ప్రచారం జరుగుతోంది. పెనమలూరు టికెట్ ఆశించిన పార్థసారథికి... అక్కడ నుంచి పోటీ చేస్తే మంత్రి పదవి ఇవ్వలేమని టీడీపీ చెప్పినట్టు సమాచారం.కృష్ణా జిల్లా పరిధిలో బీసీ కోటాలో మంత్రి పదవి ఖాళీ లేదని, నూజివీడు నుంచి పోటీ చేసి గెలిస్తే ఏలూరు జిల్లా కేటగిరీలో బీసీ కోటాలో మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో పెనమలూరు కావాలని పట్టుబట్టిన పార్థసారథి మెల్లగా నూజివీడు వైపు షిఫ్ట్ అవుతున్నారు. నూజివీడు టీడీపీ నేతలకు ఫోన్లు చేసి... తనకు సహకరించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. ఈసారి మంత్రి పదవి మాత్రం మిస్ అవకూడదనే టార్గెట్‌తో ఉన్నట్లు సమాచారం. మరోవైపు ప్రస్తుత టీడీపీ ఇన్ చార్జ్ ముద్రబోయిన వెంకటేశ్వరరావు... పార్థసారథి టీడీపీ చేరితే ఏంటన్న దానిపై తన అనుచరులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

## రాజ్యసభ పై కమలం గురి...

న్యూఢిల్లీ, జనవరి 30, ప్రజాపాలన ప్రతినిధి : టార్గెట్.. హ్యాట్రిక్. 4 వందల ప్లస్ అంటూ లోక్ సభ పోల్ మిషన్ చేపట్టింది బీజేపీ. దిగువ సభలో బలం సరే. కీలక బిల్లుల క్లియరెన్స్‌కు కిరికిరిలేకుండా పెద్దల సభలో ఈసారి కమలదళం బలగం పెరుగనుందా? అంటే.. అవుననే చెబుతున్నాయి బీజేపీ శ్రేణులు.. ఇప్పటికే రాజ్యసభ ఎన్నికలపై స్పెషల్ ఫోకస్ చేసిన బీజేపీ.. ఎక్కువ స్థానాలను దక్కించుకునేందుకు వ్యూహాలను రచిస్తోంది. కాగా.. రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది.15 రాష్ట్రాల్లో ఖాళీ అయిన 56 రాజ్యసభ స్థానాల్లో ఎన్నికల కోసం ఫిబ్రవరి 8న నోటిఫికేషన్ రానుంది. నామినేషన్ల దాఖలకు తుది గడవు ఫిబ్రవరి 15? నామినేషన్ల పరిశీలన ఫిబ్రవరి 16న, నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు ఫిబ్రవరి 20 .ఇక పోలింగ్ ఫిబ్రవరి 27న జరుగుతుంది.ఫలితాలు ప్రకటన కూడా అదే రోజు ఉండనుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల నుంచి 6 స్థానాలు కాళీ అవుతుండగా ఏపీలో మూడు, తెలంగాణలో మూడు సీట్లు భర్తీ కానున్నాయి.లోక్‌సభ ఎన్నికల్లో హ్యాట్రిక్ టార్గెట్‌గా బీజేపీ వ్యూహాలకు పదను పెడుతోంది. ఎట్ ద సేమ్ కీలక బిల్లుల క్లియరెన్స్ కోసం పెద్దల సభలో బలం పెంచుకోవడంపై కూడా ఫోకస్ పెట్టింది బీజేపీ. రాజ్యసభలో బలగం పెరిగితే పెండింగ్ బిల్లుల ఆమోదానికి లైన్ క్లియర్ అవుతుంది కాబట్టి బలం పెంచుకునేలా వ్యూహ రచన చేస్తోంది. ప్రస్తుతం రాజ్యసభలో బీజేపీ సభ్యుల సంఖ్య 93. ఎన్‌డీఏ కూటమి ప్రకారం చేస్తే 114 మంది సభ్యులున్నారు. అసెంబ్లీ కోటాలో జరగున్న రాజ్యసభ ఎంపీ ఎన్నికల్లో బీజేపీ బలం కొంత పెరగనుంది.ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లో బంపర్ విక్టరీ సాధించింది. మధ్యప్రదేశ్‌లో 4 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక జరగబోతుంది. నాలుగుకు నాలుగు బీజేపీ ఖాతాలో చేరే అవకాశం మెండుగా వుంది. ఇక చత్తీస్ గఢ్‌లో ఒక స్థానం బీజేపీ కైవసం కానుంది. రాజస్థాన్‌లో గతంలో బీజేపీకి ఒకే ఒక రాజ్యసభ స్థానం ఉంది. ఇప్పుడు ఎన్నికలు జరగుబోయే మూడు స్థానాల్లో బీజేపీ రెండింటిని గెలుచుకునే చాన్స్ ఉంది. ఈ లెక్కన బీజేపీ ఖాతాలో మరో ఆరు రాజ్యసభ స్థానాలు చేరే అవకాశం వుంది. జేడీయూ జత కలిసింది కాబట్టీ ఎన్‌డీయేకు బీహార్ నుంచి మరో రెండు స్థానాలు యాడ్ అయ్యే అవకాశం ఉంది.

# తమన్నా పెళ్లెప్పుడంటే?



టాలివుడ్ స్టార్ హీరోయిన్ మిల్క్ బ్యూటీ తమన్నా ఈ ఏడాది పెళ్లి చేసుకోబోతోందట. గత ఏడాది విడుదలైన లస్ట్ స్టోరీస్ 2 వెబ్ సిరీస్ లో విజయ్ వర్మ, తమన్నా జంటగా నటించారు. ఈ సిరీస్ ద్వారా ఏర్పడిన ఆ పరిచయమే ఇద్దరి మధ్య ప్రేమగా మారింది. ఓ పార్టీలో తమన్నా, విజయ్ కిస్సింగ్ ఫొటోస్ లీక్ అయ్యాయి. దీంతో అడ్డంగా దొరికిపోయామని భావించిన వీళ్లిద్దరూ తాము ప్రేమలో ఉన్నట్టు అనౌన్స్ చేసేశారు. నిన్నటి మొన్నటి వరకు సినిమాలు, వెబ్ సిరీస్‌లతో బిజీ షెడ్యూల్ ను మెయింటైన్ చేసిన తమన్నా తాజాగా దైవ చింతనలో పడిపోయింది. వరుసగా దేవాలయాలను సందర్శిస్తోంది. ఇటీవల కుటుంబ సభ్యులతో పాటు గౌహతిలోని కామాఖ్య ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు కూడా చేసేసింది. దీంతో పెళ్లిపై మళ్లీ వార్తలు ఊపందుకున్నాయి.. ఈ ఏడాదిలోనే పెళ్లి అనే వార్తలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.. ఆ తేదీ ఎప్పుడనేది ప్రస్తుతానికి సస్పెన్స్.!



## 'యానిమల్ పార్క్' పై సందీప్ తాజా కామెంట్



నిరంతరం ఇండస్ట్రీ ప్రజలు తన గురించే మాట్లాడుకునేలా చేయాలంటే ఏం చేయాలో సందీప్ రెడ్డి వంగాకు తెలిసినంతగా ఇంకెవరికీ తెలీదేమో! అతడు తెరకెక్కించిన అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్ చిత్రాలతో ఒక డెబ్యూగా దక్షిణాది ఉత్తరాది సహా అన్ని చోట్లా చర్చించుకునేలా చేసాడు. ఇది అతడి యూనిక్ ట్యాలెంట్. రా కంటెంట్ తో రఫ్ఫాడించడం అతడికి అలవాటు వ్యాపకం. అయితే యానిమల్ తో అతడు మితిమీరిన హింస, రక్తపాతం, స్త్రీ ద్వేషాన్ని, విషపూరిత పురుషత్వాన్ని తెరపై చూపించడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఎన్ని విమర్శలు వచ్చినా కానీ, తన సినిమాని లైమ్ లైట్ లో ఉంచడమెలానో, తన హీరోని మరో మెట్టు పైకి ఎక్కించడం ఎలానో, బాక్సాఫీస్ వద్ద కనకవర్షంతో నిర్మాతల్ని ఆనందంలో ఉంచడం ఎలానో సందీప్ రెడ్డి వంగాకు బాగా తెలుసు. అందుకే అతడితో కలిసి పని చేసిన నిర్మాతలు తనను అస్సలు విడిచిపెట్టడం లేదు. తదుపరి యానిమల్ సీక్వెల్ యానిమల్ పార్క్ ని టీసిరీస్ తో కలిసి సందీప్ వంగా భారీ వ్యయంతో నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. సందీప్ వంగా వ్యాఖ్య మరోసారి హాట్ టాపిక్ గా మారింది. యానిమల్ పార్క్ గురించి సందీప్ వంగాను ప్రశ్నించగా.. రెండో భాగం మొదటి భాగం కంటే మరింత క్రేజీగా పెద్దదిగా ఉంటుందని చెప్పాడు. తాను కొన్ని క్రూరమైన ప్రణాళికలను కలిగి ఉన్నానని అన్నాడు. నిజానికి కబీర్ సింగ్ తో హింసను జుగుప్సాకరంగా ప్రేరేపించాడని విమర్శల్ని ఎదుర్కొన్న సందీప్ వంగా తన తదుపరి చిత్రంలో హింసకు నిజమైన అర్థాన్ని చూపిస్తానని ఛాలెంజ్ విసిరాడు. తాను అన్నట్టుగానే యానిమల్ చిత్రంలో రణబీర్ లాంటి చాక్లెట్ బోయ్ ని క్రూరుడిగా చూపించాడు. తండ్రిని అమితంగాగా ప్రేమించి అభిమానించే కొడుకు తనని శత్రువుల నుంచి కాపాడుకోవడం కోసం ఏం చేసాడనేది యానిమల్ లో చూపించాడు. అయితే దానికి సందీప్ వంగా తనదైన ట్రీట్ మెంట్ ఇవ్వడంతో అది మాస్ లో పూనకాలు పుట్టించింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధించడంలో విజయం సాధించడానికి అతడు ఎంచుకున్న మార్గమే అసలు కారణం. యానిమల్ పార్క్ చిత్రం అంతకు మించి ఉంటుందని ఇప్పుడు చెబుతున్నాడు. యానిమల్ ని మించి ఇంకా ఘాటైన సన్నివేశాలతో దీనిని తీస్తానని స్పష్టంగా చెప్పాడు. ఇటీవల నెట్ ఫ్లిక్స్ లో విడుదలైన యానిమల్ ని అన్ని వర్గాల ప్రేక్షకులు వీక్షించారు. కొందరు అసహ్యించుకున్నా చాలా మందికి నచ్చుతోంది. ఏది ఏమైనా తనని మర్చిపోనీకుండా సందీప్ వంగా ఏదో ఒకటి చేస్తూనే ఉన్నాడు.

## అందం రాశి పోసినట్లు...!



ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఈ అమ్మడు తెలుగు తో పాటు తమిళ ఇండస్ట్రీలో కూడా పలువురు యంగ్ స్టార్ హీరోలతో సినిమాలు చేసి మంచి గుర్తింపు దక్కించుకుంది. ఈ మధ్య కాలంలో ఈ అమ్మడు కోలీవుడ్ కే ఎక్కువగా పరిమితం అవుతోంది.తెలుగు లో ఈ అమ్మడు ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదు, అదే సమయంలో యంగ్ హీరోలతో చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడుతున్నాయి. దాంతో ఈ అమ్మడు కోలీవుడ్ పై ఎక్కువ దృష్టి పెట్టింది. తాజాగా ఈ అమ్మడు బాలీవుడ్ వైపు కూడా అడుగులు వేసేందుకు ప్రయత్నాలు చేస్తుందా అని ఈ ఫోటోలు చూస్తూ ఉంటే అనిపిస్తుంది. బ్లూ కలర్ జీన్స్ లో విభిన్నమైన ఔట్ ఫిట్ తో రాశి ఖన్నా చూపరులకు కన్నుల విందు చేస్తుంది. రాశి అందం రాశి పోసినట్లుగా అందంగా ఉంది. సోషల్ మీడియాలో ఈ ఫోటోలు షేర్ చేయడం ద్వారా ముద్దుగుమ్మకు మరింత పాపులారిటీ లభించడం ఖాయం అన్నట్లుగా ఆమె ఫ్యాన్స్ మరియు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## చిరునవ్వుతో థియేటర్ నుంచి బయటకు వస్తారు

### హ్యాపీ ఎండింగ్ నిర్మాత అనిల్ పల్లాల



చిరునవ్వుతో థియేటర్ నుంచి బయటకు వస్తారు యష్ పూరి హీరోగా నటించిన కొత్త సినిమా 'హ్యాపీ ఎండింగ్'. అపూర్వ రావ్ హీరోయిన్ గా నటించింది. యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మాతలు. కౌశిక్ భీమిడి దర్శకత్వం వహించారు. హ్యాపీ ఎండింగ్ సినిమా ఫిబ్రవరి 2న థియేటర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా సినిమా హైలైట్స్‌ను నిర్మాత అనిల్ పల్లాల మీడియాకు వివరించారు.

- హ్యాపీ ఎండింగ్ సినిమాలో యువత నచ్చేలా ఉంటూనే సందేశాత్మకంగా నిర్మించాం . అనుకున్న బడ్జెట్ లో పూర్తి చేశాం. కొత్త హీరో కాబట్టి రిలీజ్ తర్వాత సినిమాకు వచ్చే స్పందనను బట్టి బిజినెస్ చేయాలనుకున్నాం. మా మొదటిసినిమా 24 కిస్సెస్ సినిమాకు థియేట్రికల్ గా మాకు పెద్దగా వర్కవుట్ కాలేదు. మేము ఇతర భాషల్లో డబ్ చేస్తే అక్కడ కూడా చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది.
- సినిమాకు కథే ముఖ్యం. తీయడంలో ఇతర అంశాలు ఎలా ఉన్నా...కథ బలంగా ఉంటే ముందుకు వెళ్లొచ్చు. హ్యాపీ ఎండింగ్ కథలో పొటెన్షియాలిటీ ఉంది. ఆ కథ మీద నమ్మకం పెట్టుకున్నాం. కొంత ఖర్చు అటూ ఇటూ అయినా రిస్క్ చేశాం. కాలిక్యులేటెడ్ రిస్క్ తీసుకున్నాం. మా సినిమాలో ఏముందో అదే ప్రమోషన్ లో ఆడియెన్స్ కు రివీల్ చేస్తున్నాం. హ్యాపీ ఎండింగ్ కథలోనూ అలాంటి ఇతర ఎలిమెంట్స్ ఉంటాయి. ఇప్పటితరం ప్రేక్షకులు కొత్త ట్రెండ్ ను స్వీకరించడానికి రెడీగా ఉంటున్నారు. హ్యాపీ ఎండింగ్ మూవీ చూస్తే మీరు ఎంటర్ టైన్ మెంట్ తో పాటు ఒక ఆలోచనలో పడతారు.
- దాదాపు టీమ్ అంతా కొత్త వాళ్లే కాబట్టి మేము హ్యాపీ ఎండింగ్ సినిమాకు దాదాపు 9 నెలల పాటు ప్రీ ప్రొడక్షన్ చేశాం. ప్రతి సీన్ మీద వర్కవుట్ చేశాం. బాగా ప్రిపేర్ అయ్యాం కాబట్టే కేవలం 30 రోజుల్లో ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ చేయగలిగాం.
- యష్ థియేటర్ నుంచి వచ్చిన ఆర్టిస్ట్ కాబట్టి బాగా పర్ ఫార్మ్ చేశాడు. హీరోయిన్ అపూర్వ కూడా థియేటర్ నుంచి వచ్చిన ఆర్టిస్టే. మా సినిమా షూటింగ్ చాలా స్మూత్ గా జరిగింది. హ్యాపీ ఎండింగ్ సినిమా టెక్నికల్ గా అన్ని క్రాఫ్ట్స్ లో ఆకట్టుకుంటుంది. సినిమా చూసి బయటకు వస్తున్నప్పుడు చిరునవ్వుతో వస్తారు.
- మా సంస్థ నుంచి ఓటీటీ తీసుకొచ్చే ఆలోచన ఇప్పుడు లేదు. రైటర్స్ టీమ్ ఉంది. వారితో మంచి స్క్రిప్ట్ చేసి అది సంతృప్తిగా ఉంటేనే కంటెంట్ మేకింగ్ కు వెళ్తుంటాం. సినిమాల్లోనూ అదే ఫాలో అవుతున్నాం. కొత్త హీరోతో ఓ స్మాల్ బడ్జెట్ మూవీ చేస్తున్నాం.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA MACS | SNEHA CLUB | PAY BACK TO SOCIETY

(Regd. No.AMC/VSP/DCO/2008/2446 Dated 07-03-2008)

SNEHA GROUP OF ORGANISATIONS 23 YEARS CELEBRATIONS

BENEFITS

- Safe and confidential
- High rate of Interest On Deposits
- No Income Tax deduction on Interest Payment
- Financial growth to all
- Support Your Business
- Easy Sanction of loan to share holders
- Dividend paid to the Share holders (since 10 Years)

Schedule of Interest Rates on Fixed & R.D.Accounts

| Term | | General | Senior Citizens |
|---|---|---|---|
| 91 Days | - 179 Days | 8.25% | 8.75% |
| 180 Days | - 1 Year | 9.25% | 9.75% |
| 1Year | - 2 Years | 10.25% | 10.50% |
| 2 Years | - 3 Years | 10.50% | 10.75% |
| 3 Years | - 5 Years | 11.00% | 11.50% |
| Above 5 Years | | 12.00% | 12.50% |
| Saving Bank A/C | | 5.00% | 5.00% |
| Recurring deposit | | 6.00% | 6.50% |

Money Multiplier Scheme

Your valuable money is Double in 7 Years

Minimum 10,000/- and above

SPS

సంవత్సరానికి11.00%వడ్డీ ఇవ్వబడును. మీ డిపాజిట్ పై లభించే వడ్డీ

| | |
|---|---|
| రూ. 1,00,000/- | రూ. 11,000/- |
| రూ. 5,00,000/- | రూ. 55.000/- |
| రూ. 10,00,000/- | రూ. 1,10,000/- |

*షరతులు వర్తిస్తాయి

ఆంధ్రప్రదేశ్ : విశాఖపట్నం : 0891-2791205,9246663046,7660027696   చింతలపూడి : 7660027675

తెలంగాణ : హైదరాబాద్ : 040-23233989, 7660027682   పొన్నూరు : 9618444604

ఆంధ్రప్రదేశ్ : డోర్.నెం.50-61-3, సీతంపేట, రాజేంద్రనగర్, విశాఖపట్నం-530016

తెలంగాణ : డోర్.నెం. 6-29÷3,మూడవ అంతస్తు , దౌలత్ప్లాజ, లక్డీకాపూల్, హైదరాబాద్-500 004.

E-mail:snehamacsltd@gmail.com


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.